
27-5-66

ఆంధ్రసచిత్రవార
పత్రిక



35 పైసలు


జూన్ 2 విడుదల!
శ్రీ విఠల్ ప్రొడక్షన్స్ వారి
అగ్గిబరాటా
సంగీతం: విజయా కృష్ణమూర్తి
కెమెరా: వరదరాజ్
కో-డైరెక్టర్స్: K.V.R. ఆచార్య
కో-ప్రొడ్యూసర్: B.V. శ్రీనివాస్
నిర్మాత: దర్శకుడు
B. విఠలాచార్య

ఉత్తరాలు

కథలు

సి. కనకాంబర రాజుగారు వ్రాసిన 'వాన్నారు ఎప్పుడొస్తారు?' అనే కథమీద గోపీచంద్‌గారి విమర్శ చదివాను. ఆవిమర్శ అసలు నిజంకాదు. కొన్ని వూళ్లలోస్కూలు మాష్టర్లే పోస్టుమాష్టర్లుగా ఉంటారని బహుశా ఆయనకు తెలియదుకాబోలు! వాలుగు సంవత్సరాల అమ్మాయిలు అంత కంటే ఎక్కువ పెద్ద పెద్ద మాటలు మాట్లాడేవారిని నేను చూశాను.

కె. కమల, కె. రవీంద్ర (మద్రాసు)

* * *

" బతుకుభయం" చాలాబాగుంది. వాస్తవికతకు దగ్గరగానే ఉందనేచెప్పాలి. యీనాడు గుమాస్తాలజీవితములు వివిధంగా ఉన్నవో వాస్తవికంగా తెలియపరిచినారు.

ఎన్. సుధారాణి, చంపా (న్యూపాల్వంచ)

* * *

"కథలాంటి నిజం" కథ కాదు, పచ్చి నిజం. చాలా బాగుంది. రచయిత రైల్వే ఎ. ఎస్. ఎమ్.ని బాగా అర్థం చేసుకుని వ్రాశారు. ఆయన ఎ. ఎస్. ఎమ్ అయినా ఆశ్చర్యంలేదు. దేశంలో ప్రతి ఒక్కరిచేతా నిర్లక్ష్యం చేయబడిన జాతి ఎ. ఎస్. ఎమ్ జాతి అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఎన్. ఎన్. మరూర్, (ఒక ఎ.ఎస్.ఎమ్.)

సీరియల్

మీరు ప్రచురించిన "కరుణ" సీరియల్ అత్యుత్తమంగావుంది కానీ ముగింపు విస్తేజంగా, నిరాశాజనకంగా అనిపించింది. పూజా పుష్పంలాంటి కరుణ, అభిమాన ధనుడూ, పవిత్రమూర్తీఅయిన మన్మథ చేయని తప్పుకు ఘోరంగా శిక్షింపబడితే నీచులూ,పరమ దుర్మార్గులూ అప్పలస్వామి వీరభద్రం సుఖంగా ఉన్నారు. ఇదెక్కడి న్యాయం? తమవల్ల రెండు నిండు జీవితాలు అనుమాన పిశాచానికి బలిఅయిపోతే చలించనివారి హృదయాలు పాషాణాలు కాబోలు. ప్రసన్న పాత్రకు ఏమాత్రం సానుభూతి లేకుండా చేశారు రచయిత. ముగింపు అలాకాక వీరభద్రం ధైర్యంగా, మన్మథ కరుణల ఆత్మహత్యల అనంతరం నిజంచెప్పేసి వారి పవిత్రతను ప్రసన్నకు అర్థంఅయ్యేలా చెప్తే ప్రసన్న నిజాన్ని తెలుసుకొని, మానసిక దౌర్బల్యంతో తాను చేసిన అవివేకమైన పనికి చింతిస్తే ఎంతో హుందాగా ఉండేది. ఒకవేళ నిజం ఇలానే ఉంటుందేమో? ఏది ఏమైనా ఈ నవల "ఆణిముత్యం." ఇంతగా హృదయాలను హత్తుకొనేలా, వాస్తవికంగావున్న నవల ఈమధ్య కాలంలో రాలేదంటే అతిశయోక్తికాదు.

గద్దం రమేష్‌కుమార్,
కుమారి గద్దం సరోజాదేవి (విజయవాడ)

" కరుణ " ముగింపు చాలా బాధ కలిగించినది. ఉన్నవ విజయలక్ష్మి గారు వ్రాసిన "నిరీక్షణ" చాలాబాగుంది చదువుతుంటే చాలా ఉత్సాహంగా ఉన్నది.

కొల్లి స్వర్ణలత (తెనాలి)

వ్యాసాలు

"వృత్తి క్రీడాకారులు" అనే వ్యాసం చాలా బావుంది. అయితే రచయిత వ్యాసంలో చిన్న పొరపాటు చేసారు. 1963 లో డేవిస్ కప్ ఛాలెంజి రవుండులో మెక్సికోమీద ఆస్ట్రేలియా గెలుపు సాధించగానే రాడ్ లేవర్ వృత్తి క్రీడాకారుడిగా మారినట్లు రాసారు. 1963 లో ఛాలెంజి రవుండులో మెక్సికో ఆడనే లేదు. ఆస్ట్రేలియా గెలుపు సాధించినది అమెరికామీద. ఆస్ట్రేలియా తరపున రాడ్ లేవర్ ఆడలేదు. రాయ్ ఎమర్సన్, ఫ్రెడ్‌స్టోల్, జాన్ న్యూకోంబ్ నీల్ ఫ్రేజర్ మాత్రమే ఆడారు. 1962 లో రచయితలు చెప్పినట్లు జరిగింది.


ఎన్. రామకృష్ణారావు (కాకినాడ)

* * *

కీ. శే. వినాయక దామోదర సావర్కర్‌ను గురించి ప్రచురించిన వ్యాసంపై విమర్శ చదివాను. శ్రీ హేమచంద్రరావు యిప్పటికీ కేవలము అసందర్భ విమర్శన, వాదనలు మాననందుకు విచారిస్తున్నాను. శ్రీ సావర్కర్‌ను గురించి ఒక పేజీ వ్రాయుటకూనూ, రీటాహేవర్తును గురించి ఎక్కువ మేటర్ వ్రాయుటకునూ సంబంధమేమిటి? ఒక వార పత్రికలో సాధారణముగా అనేక విషయాలు, అనేక వ్యక్తులగురించి ప్రచురితమవుతూ ఉంటాయి. ఒక వ్యక్తిని యింకొక వ్యక్తితో పోల్చటము చాలా శోచనీయం. వ్యక్తినిబట్టి పత్రికలో స్థల నిర్ణయము జరగాలనే విధానము ఎక్కడా లేదు. ఇకపోతే పత్రికలు తగులబెట్టాలని వ్రాయుట అది వారి అజ్ఞానాన్ని మాత్రమే తెలియజేస్తుంది.

నిమ్మగడ్డ స్వరూప (కపిలేశ్వరపురం) ●


హాకీ ఆటగాడే రాజుకు వెన్నునొప్పి
ఈ రోజు మధ్యాహ్నం హాకీ మ్యాచ్ వుంది. కాని నేను ఆడే స్థితిలో లేను. వెన్ను నొప్పిగా వుంది
ఒక సారిడన్ వేసుకో. వెంటనే నొప్పి తగ్గుతుంది చూడు!
రాజు ఒక సారిడన్ వేసుకొనును
తరువాత...
నా వెన్ను నొప్పి మాయమైంది. సారిడన్ ఎంత అద్భుతమైంది!



ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం 27—5—'66

పరాభవనామ సం॥ జ్యేష్ఠమాసం శు॥ అష్టమి

సంపుటము : 58 సంచిక : 39

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీథి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు

ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	24.50
అర్ధసంవత్సర చందా	12.25

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేననీ, దేనికీ అనుకరణ కాదనీ హామీగా వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించ లేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

మనలో మాట

ప్రస్తుతం మేము ప్రచురిస్తున్న రెండు సీరియల్స్‌తో బాటు, మరో 'సీరియల్ నవల'ను కూడా మా పాఠకులకు అందచేయాలనే సంకల్పంతో ప్రయత్నాలు చేస్తున్నాం. వచ్చేవారం ప్రారంభం అయ్యే ఉజ్వల చారిత్రాత్మక నవల 'ఆమ్రపాలి' కథ పాఠకులలో కొందరికి తెలిసే వుండాలి.

* * *

'వనితాలోకం'లో గత పదివారాలుగా ప్రచురిస్తున్న 'చెల్లాయికి ప్రేమతో'—వుత్తరాలు యీవారంతో ముగుస్తున్నాయి. నిత్యజీవితంలో మహిళలు ఎదుర్కొనే పది వేర్వేరు అంశాలను గురించి 'పి. ఎస్.' గారు వ్రాసిన యీ రచనలు పాఠకులలో చాలా మందికి నచ్చినట్లే వున్నాయి.

'వనితాలోకం'లో మరో శీర్షిక ఒకటి త్వరలో ఆరంభించాలని మా సంకల్పం!

* * *

'మూగజీవులు' పడే వేదనను గురించి చిన్న వ్యాసం ఒకటి యీ వారం 11,12 పేజీలో వేశాము.


28వ పేజీలో ప్రారంభం అయ్యే 'తండ్రి మనసు' కథను వ్రాసినది శ్రీ కొలను వేంకటదుర్గాప్రసాద్ అని మా పాఠకులు గమనించాలి.

* * *

ఈ వారంతో ముగుస్తున్న మరొక శీర్షిక—'పన్నీటి పిధుల్లో కన్నీటి జల్లులు!'... 'సినిమారంగం' నానాటికీ 'సమస్యల రంగం' అవుతున్నదని కొందరంటున్న యీరోజుల్లో కొత్తవారికి కూడా సమస్యలే మిగులుతున్నాయి. వాని వివరిస్తే తిని సాధ్యమయినంతవరకు వివరించాలనే సదభిప్రాయంతో యీ శీర్షికను ఏర్పాటు చేశామేగాని, ఏ ఒక వ్యక్తినీ, ఏ ఒక సంస్థను దృష్టిలో వుంచుకొని మాత్రం కాదు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం: 'పరమానందయ్య శిష్యులు కథ'లో ఎల్. విజయలక్ష్మి.


ప్రజాభిప్రాయం
రక్షణకు అణుశక్తి
ప్రజాభిప్రాయానికే విజయం
ఆనందం లేకపోయినా ఏదో కలిసి జీవిద్దాం
అతివాదులు
మితవాదులు
కమ్యూనిస్టులు
ఇవన్నీ వాళ్ళను కరవాలి
ఇండియా
ఒకే మడుగులో చేపల వేట
సంజీవరెడ్డి
సంజీవయ్య
ఆంధ్ర రాజకీయాలు.

శ్రీకృష్ణ

స్వయంజనకమైన ఆర్థిక వ్యవస్థ: విదేశీ సహాయం

ప్రస్తుతం ప్రణాళికామంత్రి శ్రీ అశోక్ మెహతా పేరు దేశంలో అన్నిపత్రికలలోనూ పతాకశీర్షికలలో చోటుచేసుకుంటోంది. అమెరికాలో యీయన ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు శ్రీ జార్జిఉడ్‌తో మంతనాలు సాగించి నాలుగవప్రణాళికలో భారతదేశం 6—7శాతం అభివృద్ధిరేటును లక్ష్యంగా పెట్టుకుని పనిచేయవలసి ఉంటుందనీ ఆస్థాయిలో పన్లుజరగాలంటే విదేశీ సహాయం మూడవ ప్రణాళికనాటికన్నా ఎక్కువ ఉండటం అవసరమనీ సూత్రంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఏప్రిల్ 23న న్యూఢిల్లీకి తెలిసింది.

భారత దేశం సాధించిన అభివృద్ధి వ్యవహారాన్ని గురించి శ్రీ మెహతా వినిపించిన ఉత్సాహకరమైన వివరణ మూలంగా శ్రీ జార్జిఉడ్ ఒక్క ఊర్పు తీసుకున్నారని కూడా తెల్సింది. ముఖ్యంగా మూడవప్రణాళికా కాలంలో సాధించిన ఘన కార్యాలనుగురించి శ్రీమెహతా శ్రీ ఉడ్‌కి ఎంతో గొప్పగా చెప్పారు.ఇది విని శ్రీజార్జిఉడ్ ఏప్రిల్ 21న ఒకనిర్ణయానికి వచ్చేశారట. తానూ లండన్ వెళ్లాలి. పారిస్ వెళ్ళాలి. భారత దేశం అవసరాలను గురించిఅక్కడి వారితో మాట్లాడాలి. ఇదంతా మే మూడు నాలుగుతారీకుల్లో పూర్తవుతుందని అన్నారు.

ఆమర్నాడు ప్రపంచ బాంకు ఓ కొత్త ప్రకటనను చేసింది. అది భారత పాకిస్తాన్ సమిష్టి అభివృద్ధి పథకాలకు సంబంధించినది. అటువంటి ప్రాజక్టులకు ప్రపంచ బాంకు ధనసహాయం చేస్తానంది. ఇలాంటి ప్రాజక్టులను గురించి పరిశీలించవలసిందిగా అధ్యక్షుడు జాన్సన్ ప్రపంచ బాంక్‌మాజీ అధ్యక్షుడు శ్రీ యూజిన్ బ్లాక్‌ను కోరి ఉన్నారు.

ఈప్రతిపాదనపై శ్రీ మెహతా చేసిన మొదటి వ్యాఖ్యానం యిలా ఉంది.

భారతదేశానికి సహాయం చేయటానికి భారత పాకిస్తాన్‌ల మధ్య అర్థికరూపమైన సహకారం ఒక షరతుగా విధించబడలేదని ఆయన అన్నారు. రెండవ వ్యాఖ్యానంలో ఈరెండుదేశాల మధ్యా ఎటువంటి సహకారం ఆప్రాజక్టులు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటాయా లేదా అన్నవిషయంమీద తదితరమైన "రాజకీయవాతావరణం" మీదకూడా ఆధారపడి ఉంటుందని శ్రీ మెహతా అనవలసి వచ్చింది. ఇందుకు సంబంధించిన మూడో వ్యాఖ్యానంలో సమిష్టి అభివృద్ధి ప్రాజక్టులను గురించి పాకిస్తాన్‌తో మాట్లాడటానికి భారత్‌ఎప్పుడూ సిద్ధంగా ఉందని ఆయన విశదం చేశారు. ఈమాటలు అన్నది ఏప్రిల్ 23న. ఆ మర్నాడు ఆయన అమెరికా విదేశాంగమంత్రి శ్రీ డీన్‌రస్క్‌ని కల్సుకున్నారు. అనంతరం భారతీయపత్రికా విలేఖరులతో మాటాడారు. శ్రీ డీన్‌రస్క్‌తో మాట్లాడినపిమ్మట తనకు కలిగిన అభిప్రాయాన్ని అభివ్యక్తం చేశారు భారత దేశానికి నాలుగో ప్రణాళికకి ధనం కావాలి. ఆధనాన్ని సమకూర్చటంలో అమెరికా సహాయకారిగా ఉంటుంది.

భారత దేశానికి విదేశీ మారకద్రవ్యం చిక్కులు ఉన్నాయి. ఆచిక్కుల తీవ్రతను కొంతవరకు తగ్గించేందుకు 5 కోట్ల డాలర్ల ద్రవ్యాన్ని విడుదల చేస్తానని ఏప్రిల్ 27న అమెరికా అన్నది. భారత పాకిస్తాన్ యుద్ధం జరిగినప్పుడు అమెరికా 41 కోట్ల 40లక్షల డాలర్లను స్తంభింప జేసింది. ఇందులో 26కోట్ల 50లక్షల డాలర్లు 1965—66 లో యిస్తానని వాగ్దానం చేసిన మొత్తం. మిగిలిన మొత్తం వాడుకోకుండా అలా ఉంచుకున్న దానిలో మిగులు. ఇక తాష్కెంట్ ఒప్పందం జరిగిన తర్వాత నుంచీ భారత దేశం అవసరాలకోసం అమెరికా విడుదల చేసినమొత్తం 15 కోట్ల డాలర్లు.

ఏప్రిల్ 28న శ్రీమెహతా మళ్లీ భారతీయపత్రికా విలేఖరులతో గోష్టిని జరిపారు. ఆసందర్భంలో ఆయన ఋణదాతలబృందంలో సభ్యరాజ్యంగా అమెరికా చేసిన వాగ్దానాలను చెల్లించి తీరవలసిందేనని భారతదేశం పట్టు బడుతుందని అన్నారు.

"ఇందులో ఏమాత్రం పొలుపూలిక జరిగినా, కృషిలోపం ఉన్నా, అయిష్టం ప్రబలినా భారతదేశంవచ్చే అయిదుసంవత్సరాలలోనూ సాధించాలని తలపెట్టిన స్వయంచోదితమైన ఆర్థిక వ్యవస్థను సాధించుకోనటం ఆలస్యం అవుతుంది" అన్నారాయన.

భారతపాకిస్తాన్ సమిష్టి ప్రాజక్టుల విషయంలో శ్రీమెహతా చేసిన మొదటి వ్యాఖ్యానం సబబుగా ఉంది. ప్రస్తుతం భారతీయులు, పాకిస్తాన్ వారూ కలసి నడిపిస్తున్న పరిశ్రమలు కనీసం మూడు ఉన్నాయి. వీనిలో రెండుబట్టల మిల్లులు, మూడోది పిండి మర. పాకిస్తానీలు ఈ పరిశ్రమలలో పనిచేయటానికి ఒక్క భారతీయునికి కూడా అవకాశం యివ్వలేదు. లాభాలలో ఒక్కపైసాకూడా పంచలేదు భారతదేశీయులకు. ప్రపంచబాంకు అధ్యక్షుడుగా యూజిన్‌బ్లాక్‌ఉన్న రోజులో సింధులోయ సమిష్టి కార్యక్రమం ప్రారంభం అయింది. దానికి ఆయనే బాధ్యుడు. ఈకార్యక్రమం క్రింద అమెరికావారు ఎంతోమంది పాకిస్తాన్‌లో పనిచేస్తున్నారు. సింధులోయ కమిషన్‌లో ప్రపంచబాంకు ప్రతినిధులు ఉన్నారు. వేరెవ్వరూకూడా భారత పాకిస్తాన్ సరిహద్దులో లాహోర్‌కు దగ్గరగా పాకిస్తాన్ త్రవ్విన కీలకమైన కాలువను పసిగట్టలేక పోయారు. ఇంధన వాయువుకు సంబంధించినవ్యవహారం యింకొకటి ఉంది. ఈవాయువుయొక్క ప్రమాదాన్ని శ్రీ నెహ్రూబాగా గుర్తించారు. ఇందంతాచెప్పటం ఈరెండుదేశాల సహకారం అభివృద్ధి చెందరాదనికాదు అదిఅభివృద్ధి చెందాల్సిందే. దానికిముందు

న్యూఢిల్లీలేఖ


నిజంగా అభివృద్ధి చెందవలసిన పరిస్థితులు కొన్ని ఉన్నాయి. ఇందుకుగాను ముందుగా ఒకపనిచేయవచ్చు. అక్కడే దాని ప్రారంభంకూడా చేయవచ్చు. తూర్పుపాకిస్తాన్ అస్సాం, బెంగాలు ఉన్నాయి. ఈమూడింటికి సంబంధించి, పరిమితమైన పరిధిలో అయినా కస్టమ్స్ యూనియన్‌ను ఏర్పాటు చేసుకోవచ్చును. ఇదిజరిగితే తక్కిన పన్లను ప్రారంభించడానికి ఆస్కారం ఉంటుంది.

నాలుగో ప్రణాళికకన్నా పూర్వం ఉన్న అప్పును తీర్చటం చాలాముఖ్యం. అప్పు తీరుస్తూ ఉంటే అప్పులు యివ్వొచ్చుననే అభిప్రాయం అవతలివారిలో కలుగుతూ ఉంటుంది. 1966—67లో భారతదేశం తీర్చవలసిన అప్పు 3170 లక్షల డాలర్లు. ఇందులో 1370 లక్షల డాలర్లు వడ్డీ. ఇదిచూచి ప్రపంచబాంక్ ఈ అప్పుల వసూళ్ల వ్యవహారంలో కొన్నిమార్పులు చేస్తే బాటుంటుందని రుణదాతల దేశాలకు సూచింపబడింది. కానీ ఒక్కసంవత్సరం ఏదో చేస్తే ఆమరుసంవత్సరం ఈచెల్లించవలసిన మొత్తం దాదాపు రెట్టింపవుతుంది. ఆకారణంచేత పన్నుల వసూళ్లపద్ధతిలో అది భారత దేశానికిఅనుకూలంగాను, ఉపయోగంగానూ ఉండాలంటే అన్నిరకాల వసూళ్లనూ 1977 దాకా నిలుపుదల చేసే పద్ధతిలో మారిటోరియంను ప్రకటించాలి. ఇంకోవిషయంకూడా ఉంది. అప్పులచెల్లింపు పద్ధతిలో ఏమార్పుచేసినా భారతదేశం వసూళ్లు వెయ్యలేకపోయిందనే అర్థమే పుట్టుకువస్తుంది. ఇటువంటి అపప్రథను భారతదేశం తనకు ఎప్పుడూ తెచ్చుకుని ఉండలేదు కాబట్టి ఏ సంవత్సరానికి ఆసంవత్సరం అప్పులు తీర్చటం నిమిత్తం అప్పులు యిస్తూ ఉండటమే వాంఛనీయం.

తిరిగి శ్రీ అశోకమెహతా విషయానికి వద్దాము. యిప్పుడు మనకు 'టేక్ ఆఫ్' లేక స్వయం జనకమైన ఆర్థిక వ్యవస్థ నినాదాలు అయినాయి, ప్రతి ప్రణాళిక ప్రారంభంలోనూ ఈటేక్ ఆఫ్ మంత్రోచ్చారణ జరుగుతూనే ఉంది. 5 సంవత్సరాల క్రితం శ్రీ నెహ్రూ ప్రపంచానికంతటికీ 1966లో భారతదేశం 'టేక్ ఆఫ్' దశను చేరుకుంటుందని వాగ్దానం చేశారు. ప్రస్తుతం 'టేక్ ఆఫ్' దశ అన్నమాట పోయి స్వయం జనకమైన ఆర్థిక వ్యవస్థ అనేమాట శ్రీ మెహతా వచ్చింది. పాశ్చాత్య రాజ్యాలకు చెప్పింది ఒకటి. ఆ రాజ్యాలు సహాయం చేయకపోతే ఆర్థిక అభివృద్ధిని సాధించటం ఆలస్యమవుతుందన్నారు. శ్రీ మీనన్‌కు పాశ్చాత్య సహాయం పనికిరాదు. ఇక్కడ ఓ సమస్య ఉంది. ఇతరదేశాలు సహాయం చేస్తాయి. దానికి తగిన విధంగా దేశంలో స్వంత ద్రవ్యాధారాలను ప్రోగు చేసుకోగలమా?

శ్రీ మెహతా యింకో పదబంధాన్ని కూడా సూచించారు. అది మనస్సుల కలయిక. అవి కలిశాయని ఆయన అంటున్నారు. తన యాత్ర ఫలించిందని కూడా ఆయన అభిప్రాయం. మెహతా సాధించిన విజయం లక్షణం ఏమిటో ప్రధానమంత్రి అలా చవి చూపించారు. అమెరికాలో యితర దేశాలకు సహాయం చేయటం మంచిదికాదనే విషయం గట్టిబడుతోంది. ఈ విషయం కూడా ప్రధాని చెప్పారు. త్వరలో శ్రీ మెహతా ఇంకో భిక్షాపాత్ర పట్టుకుని రష్యా పోతామంటున్నారు. సహాయం చేస్తున్న దేశాలకూ, భారతదేశానికీ మధ్య ముఖాముఖీ సంభాషణలు జరగలని కూడా శ్రీ మెహతా చెప్తున్నారు. భారతదేశం ప్రణాళిక ఎటువంటిదో వాణిజ్య వర్గాల వారి సంస్థ యిటీవల ఒక హెచ్చరిక రూపంలో వ్యక్తం చేసింది. ఈ సమాజం యొక్క 'ముఖం' భారత వాణిజ్య మండలుల సమాఖ్య.

ఆ సమాఖ్యవారు మన ప్రణాళిక అవాస్తవికంగా ఉందనీ అలా ఉండకూడదనీ అన్నారు. వారన్నమాటలివి: మూడవ ప్రణాళిక సంగతి చూశాం. అందులో సాధించినవీ, సాధించనివీ ఉన్నాయి. అవి మనకంటికి చూపును ఏమైనా యిస్తే నాలుగో ప్రణాళిక జయప్రదం కావటం దాని యొక్క పరిమాణం మీద కాక సర్వస్థాయిల లోనూ ఉత్సాహశక్తిని యిది ఏవిధంగా పురికొల్పుతుంది అనే దాని మీద ఆధారపడి ఉంటుంది.



MONARCH
LUXURY TALC
FOR MEN
J.K. Helene Curtis


మేలిరకం "డస్ట్" టీలలో సాటిలేనిది
లిప్టన్స్
హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ
HIMALAYAN
FINEST
GOLDEN DUST TEA
LIPTON'S
FINEST
GOLDEN DUST TEA
ఈ టీతో మీరు కమ్మని, చిక్కని బంగారు ఛాయగల టీ కప్పుల వెంబడి కప్పులు అతి త్వరలో తయారుచేయగలుగుదురు ఈ పానీయమును మీరే త్రాగి చూడండి మీ అతిధులకుకూడా ఇవ్వండి. మీరు తప్పక సంతోషములో వికసిస్తారు. అవును- మీ ఆనందభరితులైన అతిధులుకూడాను లిప్టన్స్ హిమాలయన్ గోల్డెన్ డస్ట్ టీ మేలిరకం టీలలో నిజంగా అద్వితీయమైనది,
LIPTON
లిప్టన్స్
అంటే
మంచి టీ

వినిపించని మూగవేదన

వ్యాసం: మాధవ్

ఫోటోలు: ప్రభాకర్



బండెడు బరువును లాగలేక లాగుతున్న బక్కచిక్కిన జీవాలు.

మిట్టమధ్యాహ్న సమయం. ఎండ నిప్పులు చెరుగుతోంది. సూర్యభగవానుడు నడినెత్తిపైకి వచ్చి భూతలంపై ఉన్న ప్రాణికోటి మీద తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. కొలిమిలోనించి వస్తున్నట్లు వేడిగాలి రివ్వున ఊపిరిలోనుంచి నాసిలోకి కొడుతోంది. గ్రీష్మతాపానికి తట్టుకోలేనికొందరు బాటప్రక్కన ఉన్న భవనాల నీడలలోకి పరుగులు తీస్తున్నారు. రోడ్డుకు కొంచెం దూరంలో ప్రక్కగా ఉన్న చిన్న చిన్న గుంటలలో అడుగున ఏకొద్దిగానో నీళ్లు ఉన్నట్లున్నాయి. కొన్ని గేదెలు వాటిలో పడుకుని అటూ ఇటూ పొర్లుతున్నాయి తాపాన్ని తగ్గించుకునేందుకు. దూరంగా ఉన్న ఏ చెట్టుక్రింద నాలికబయటపెట్టి వగరుస్తూ తిరిగా పడుకుని ఉష్ణాధిక్యతను ఉపశమింపచేసుకుంటోంది ఓ కుక్క. ప్రచండభానుని ప్రతాపానికితాళలేక ప్రాణికోటి అంతా వేదనకు గురిఅవుతున్న ఆసమయంలో కంటపడినటువంటి మిక్కిలి ఆవేదనాపూరితమైన దృశ్యమొకటి నా అడుగు ముందుకు పడకుండా చేసింది.

నిండుగా సామానులు వేసుకుని వస్తున్నది ఓ రెండెడ్ల బండి. దానిపై బరువును చూస్తేనే తెలుస్తుంది, అంతకంటే ఇంకా ఎక్కువవేస్తే బండి విరుగుతుందేమోనని భయపడి వేయలేదని. విరామం లేకుండా ప్రయాణం చేయటంవల్ల బండిని లాగుతున్న బక్కచిక్కిన ఎడ్ల నోటివెంబడి నురుగులు కక్కుతున్నాయి. వగరుస్తూ వేగంగా లాగలేక మెల్లగా ఈడుస్తున్నాయి బండిని. ఇంతలో దారిలో ఏటవాలుగా ఉన్న బ్రిడ్జి నొకదాన్ని దాటాల్సివచ్చింది. అంతవరకూ సమతలంగా ఉన్న బాటపై శక్తినంతా కూడదీసుకుని లాగలేకలాగుతున్న జీవాలకు బ్రిడ్జిని ఎక్కడం శక్తినిమించిన పనైపోయింది. ఎలాగో కొంతదూరంలాగి ఇక మావల్ల కాదన్నట్లు నిలబడిపోయాయి ఎడ్లు. దాంతో బండిమీదున్న వ్యక్తి కోపంతో లేచి బండివాడిని నిలబడి శక్తికొద్దీ వాటిని కొట్టటం ప్రారంభించాడు. ఎడ్లు అతడు కొట్టే దెబ్బలను సహించలేక, తలకి మించిన బరువును బ్రిడ్జి ఎక్కించలేక సతమతమవుతున్నాయి. అడుగు ముందుకు వేయటానికి, బండిపై ఉన్న వ్యక్తి కొట్టే దెబ్బలను ఓర్చుకోవటానికి కూడా శక్తిలేని ఆబక్కచిక్కిన జీవాలు ఎలాగో ముందడుగు వేయటానికి ప్రయత్నించాయి.



ట్రక్కుని తప్పించి...

శక్తినంతా కూడదీసుకుని లాగటానికి చేసిన ఆ ప్రయత్నంలో నిలవలేక ఒక ఎద్దు చతికిలబడింది ఇక తన పనై పోయిందన్నట్లు. వెంటనే బండివాడు రెట్టించిన కోపంతో కిందికి దూకి చేతిలోని కర్రతో శక్తి కొద్దీ దాన్ని దారుణంగా కొట్టటం ప్రారంభించాడు. హృదయాన్ని కదిలించే ఆ దృశ్యాన్ని చూసి దారేపోయే కొందరి గుండెలు కరిగి తలా ఒక చెయ్యివేసి బండి ముందుకు పోవడానికి సహాయం చేశారు. లేకుంటే పర్యవసానం ఎలా ఉండేదో ఊహించటం కష్టం.

ధనార్జనే ముఖ్యోద్దేశ్యంగా పెట్టుకున్న ఈ బండ్లవాళ్లకు ఆ మూగ జీవాల బాధ ఎలా అర్థమవుతుంది.

కొన్ని సందర్భాలలో శక్తికి మించిన బరువులు లాగలేక, వంతెనలు ఎక్కలేక బండి పైన ఉండే వ్యక్తి కొట్టే దెబ్బలకు

తాళలేక కొన్ని జంతువులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన సంఘటనలు కూడా లేక పోలేదు.

వ్యవసాయదారులు ఈ జంతువులను ఎంతో జాగ్రత్తగా, ప్రేమతో పోషిస్తారు. కానీ వ్యాపార దృష్టితో బండ్లను లాగించే వాళ్లు వీటిపట్ల ఎంతో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తారు, ఆహార విషయంలో కూడా. పీపాలను చెక్కపెట్టెలలో పెట్టి అందులో ఎండుగడ్డి ఉంచి ఒకచోట నుంచి మరో చోటికి పంపిస్తారు. అవి కొన్నవాళ్లు ఆ గడ్డిని చౌకగా అమ్మేస్తారు. విడిగా మంచిగడ్డి కొంటే ఎక్కువ డబ్బు అవుతుందనే ఉద్దేశ్యంతో చౌకగా దీన్ని కొని ఈ జంతువులకు వేస్తారు. అదెంత ప్రమాదకరమైనదో వాళ్లకు సరిగా తెలీదు. కొత్త పీపాలకు గాజుపొడి అంటుకుని ఉంటుంది. గడ్డిలో ప్యాక్ చేసినందువ అది దానికి అంటుకుంటుంది. జంతువులు ఆ గడ్డిని తినటంతో ఆపొడి జీర్ణకోశంలోకి పోయి అక్కడ పుండ్లు ఏర్పడి రక్తస్రావం జరిగి విపరీతమైన బాధతో కొంతకాలం తర్వాత అవి మరణిస్తాయి.

...మూగవేదన

విపరీతమైన బరువును విరామం లేకుండా లాగించడంవల్ల మెడ మీదా, కాళ్ల పైనా రాపిడి పుళ్లు ఏర్పడి ఆ ప్రదేశాలు వాచి పోవడం కూడా కద్దు. అయినా దయాదాక్షిణ్యాలను విస్మరించి వాటిచేత అలా పని చేయిస్తూనే ఉంటారు. ఆ బాధతో, విపరీతమైన బరువుగల బండ్లను ఈడ్చుకొని వంతెనలను ఎక్కేటప్పుడు అవి పడే వేదన ఎదుటివారి హృదయాలను కదిలిస్తుంది, కానీ ఆ బండివాని గుండె మాత్రం కరుగదు. ఆ సమయంలో బాధను భరించలేక భరిస్తూ విడిచే కన్నీటిని కూడా కొన్ని సందర్భాలలో మనం గమనించవచ్చు. భరించలేని బాధ కలిగినప్పుడు మనుష్యులే కాదు జంతువులు కూడా కన్నీటిని వర్షిస్తాయి.

సరైన తిండి, విశ్రాంతి లేక బక్కచిక్కి బరువును లాగలేక బాధపడుతున్నా, రాపిడి పుండ్లపై మెడ మీది కాడి మరింత ఒరుసుకొని మండుతున్నా అవి ఎవరితో చెప్పుకోగలవు? చెప్పుకోడానికి నోరులేని ఆ మూగ జీవుల వేదనను అర్థం చేసుకునే దెవరు? బాధలలోనే వాటి బ్రతుకు తెల్లవారుతుంది. ముసలివై చివరకు అసువులను కోల్పోయే వరకూ అవి యజమానికి తమ గ్రాసం కోసం సంపాదించి పెట్టాల్సిందే. యజమానులు కూడా అనవసరంగా వాటిని మేపటం దండుగని బాడుగలు తోలటానికి పంపిస్తారు. రోజుకింతని యిచ్చి ఈబండ్లు తోలేవారు వాటిని తీసికెళ్లి నానా రకాలుగా హింసించి వాటిచేత పని చేయిస్తారు స్వలాభాపేక్షతో. అంతగా తిండి పెట్టలేని యజమాని వాటిని ఏ 'పింజర్ పోల్'కో పంపిస్తే వాటికీ సుఖం ఉంటుంది, యజమానికీ నష్టం ఉండదు. కానీ వాళ్లలా చేయరు. అవి చచ్చేదాకా తమకు ఏదో కొంత లాభాన్ని సంపాదించి పెట్టాలనే ఉద్దేశ్యంతోనే ఉంటారు.

గుజరాతీలు నిర్వహించే యీ 'పింజర్ పోల్'లతో ముసలివైపోయి ఏ పనికీ ఉపయోగించని జంతువులను, ఏదైన జబ్బువల్ల పనికి రాకుండా పోయిన వాటిని, తిండి పెట్టటం దండగని కసాయి వాళ్లకు అమ్మే వాటిని తీసుకువచ్చి, అవి జీవించి ఉన్నంత కాలం వాటికి తిండి పెట్టి, జాగ్రత్తగా సంరక్షిస్తారు. గుజరాతీలంతా చందాలువేసు కొని వీటికి కావలసిన ధనాన్ని సేకరిస్తారు.

జంతువులను యిలా హింసించటం జీవకారుణ్య సంఘంవారు కూడా కొంతవరకు అరికట్టడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ వారి దృష్టిలోకి రాకుండా జరిగేవెన్నో!

జీవకారుణ్య సంఘంవారికి యిలాంటి హింసాకాండలు కన్పిస్తే వెంటనే దానికి బాధ్యులైన వ్యక్తులను తీసికెళ్లి న్యాయస్థానంలో పెడతారు. నోరులేని జంతువుల పట్ల నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించిన వారికి జరిమానాలను విధిస్తారు. ప్రభుత్వం యీ సంఘానికి కొన్నిహక్కులను ప్రసాదించింది. ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా జరిగేవి జరుగుతూనే ఉన్నాయి. సరిగా తిండిపెట్టక నిర్దాక్షిణ్యంగా హింసిస్తూ పెద్దపెద్ద బరువులకు బక్కచిక్కిన ఆ జీవాల చేత లాగించడం అన్నది మానవత్వానికే తలవంపులు తెచ్చే చర్య. జంతువులకూ బాధ అన్నది ఉంటుంది. నోరువిప్పి చెప్పుకోడానికి వీలుకాని ఆ జంతువులు భరించలేని బాధను అనుభవించే సమయంలో కన్నీటిని కార్చటం కంటే వేరేమీ చేయలేవు. కానీ కనిపించే ఆ కన్నీటిని గుర్తించి, వినిపించని ఆ మూగవేదనను సానుభూతితో అర్థం చేసుకునే వారెందరు? ●





ఒకటవ తారీకు వస్తుందంటే ఆనందించేవాళ్లకంటే భయపడేవారే ఎక్కువేమో ప్రస్తుత పరిస్థితుల్నిబట్టి. చాలీ చాలనీ జీతాలు. సంతృప్తి అంటూ ఉండదు. ప్రతీ నెలా వెలితే. ధరలకు ఫుల్‌స్టాపంటూ లేదు. ఇక ఒకటి తప్పితే ఒకటి ఖర్చులు అనుకున్నవాటికంటె అనుకోనివి ఎక్కువ. అందులోను ఈ పట్నాలో ఉంటే బంధువులు, స్నేహితులు పని కట్టుకు మరీ వస్తారు. ఈ యిబ్బంది లన్నీ మధ్య కుటుంబీకులకే. వీరు క్రిందికి దిగాలేరు. మీదికి వెళ్లే తాహతూ లేదు. ఎన్ని రకాల ప్రణాళికలు వేసినా ఈ లోటు మాత్రం తీరలేదు. తీరే టట్టు కన్పట్టంలేదు. ఏదో ఆశ మాత్రం లీలగా కన్పడుతోంది.

ఇంట్లో చూస్తే అందరం ఒక్కలాగే ఉన్నాం. ఏ ఒక్కరికీ ఆనందం అంటే ఏమిటోలా ఉంటుంది. కష్టాలకే అలవాటు పడ్డాం. కాబట్టి సరిపోతుంది. కష్టాల్ని కమ్మగా ఆహ్వానించగల శక్తి కూడా ఉంది. ఒక్క జీతం, అదీ ఎవ్వరికని యీయడం. పాలకు యీయకపోతే ఆమె వూరుకోదు. షావుకారుకు యీయకపోతే మళ్లా సరుకు లీయడు. అద్దె యివ్వకపోతే యిళ్లు ఖాళీ చేయాలి. ఇవే ప్రశ్నలతో కొట్లాడుతున్నాడు మన వీర్రాజు. "సాయంకాలానికి బియ్యం లేవురా నాయనా" యింట్లోనుండి అమ్మ కేక. గబగబా బట్టలు వేసుకుని తాలూకాఫీసుకు బయలుదేరాడు. అరబస్తా బియ్యం పర్మిటు కోసరం. వెళ్లి చూస్తే అది తాలూకాఫీసా .... లేకపోతే ఏదైనా సంత జరుగుతుందా. అయినా ఈ రోజుల్లో ఆశ్చర్యపోనవసరంలేదు. తాసీల్దారుగారు మంచి గిరాకీలో ఉన్నారు. అందులోనూ ప్రమోషన మీద వస్తే వేరే చెప్పాలా? అసలు ఈ రోజుల్లో తాలూకాఫీసులో వాళ్లందర్కీ గిరాకీయే. ఒకరిమీద ఒకరు కొత్తగా వచ్చిన సినిమా టికెట్లు కోసం పడుతున్నట్లు పడుతున్నారు.

వీర్రాజు ఒక్కసారిగా లోపల్కి చొరపడ్డాడు. అభిమన్యుడు పద్మవ్యూహంలోనికి పోయినట్లుగా. ఓహో ......తాసీల్దారుగారు సిగరెట్టు కాల్చుకుంటూ గుమాస్తాగార్కి ఆర్డర్లు జారీచేస్తున్నారు. చుట్టూ పెద వాళ్లంతా ఉన్నారు. డాక్టరుగారు, మాజీ ఎం. ఎల్. ఎ. గారు, శాస్త్రులుగారూ వగైరా వగైరా ....ఇక వీర్రాజుకు ఆశ లేదు ఈరోజు. అయినా తనకురిక్కనే ఆయుధం ఉందిగా. ప్రయోగించి చూద్దాం అనుకున్నాడు మనస్సులో "బియ్యంలేవు. గోధుమలు గాని పంచదార గాని తీసుకెళ్లండి" హెడ్గుమాస్తాగారి కంఠం ఘోషిస్తోంది. వీర్రాజుకో ఆలోచన తట్టింది. అంతా పోయేదాకా ఉంటే రిక్క చూపించి ఏదోలా బ్రతిమాలుకుందాం. కనీసం పావయినా యిస్తే రోజు లీడ్చేయవచ్చు. అనుకొని ప్రక్క కాఫీ హోటల్లో పడ్డాడు.

హోటల్లో కూడా కాఫీ డబ్బులు మిగిలాయి. మిత్రులు సూరిగాడూ, రావుగార్లూ కలిసి పలకరించారు. తన బిలు కూడా వాళ్ల బిల్లుతో కలిపి యిచ్చే

పాడు. అప్పుడప్పుడు పాదరసంలా పని చేస్తుంది లెండి వీర్రాజు బుర్ర. ముగ్గురూ కలసి ఆఫీసువేపు వస్తున్నారు. ఒక్కసారిగా వీర్రాజు గుండె ఆగిపోయినట్లయింది. గేటు దగ్గర భూమ్మీద... కళ్లు తడబడ్తున్నాయి. నోట్లలా కన్పడుతున్నాయి. తియ్యాలా .... మానాలా చుట్టూ చూసాడు. అంతా ఒక్క క్షణములో జరిగిపోయింది. ఒక్క రిక్షావాడు తప్ప మరెవ్వరూ చూడలేదు. చూసి గూడా వూరుకున్నాడు సందేహంగా. పాపం వాడికేం తెల్సు అవి వీర్రాజువి కావని. ఒళ్లంతా చమట పట్టేసింది. "ఒరే లెక్కపెట్రా రాజూ" వాళ్లిద్దరూ. "ఉండండ్రా ముఖం తుడుచుకోనీయండి" అంటూ తన రుమాలుతో ముఖం కళ్ళూ తుడ్చుకున్నాడు గట్టిగా. లెక్కపెడ్తుంటే చేతులు వణుకుతున్నాయి. కళ్లు తడబడుతున్నాయి. ఒక్కొక్క నోటూ నాలుగేసిలా కన్పడుతున్నాయి. రెండు పదులు, రెండయిదులు,అయిదు రెళ్ళూ అయిదు ఒకట్లూ... మొత్తం చూస్తే 45 రూపాయలు... హమ్మయ్య .... యిప్పుడేం చేయడం.. ఎవరయినా వెతుక్కుంటున్నారేమో. చుట్టూ చూసాడు అమాయకపు వీర్రాజు. ఎక్కడా ఆ జాడే లేదు. ఎవరో దురదృష్టవంతులు. పాపం అరబస్తా బియ్యం డబ్బులు. తనలాగే నెలంతా ఎంత బాధపడ్తాడో. బియ్యం కోసం యెదురుచూస్తున్న భార్యా బిడ్డలకు యేం చెపుతాడో. ఎక్కడ వెతుక్కుంటున్నాడో ఏమో. నెలంతా కష్టపడి సంపాదించిన డబ్బులు. ప్రొద్దున్నే ఎవరి మొహం చూసాడో. పోనీ యెవ్వరికైనా చెప్పేస్తే .... ప్రతీవాడూ నావే నంటారేమో. వో చిన్న పని చేద్దాం అనిపించింది.—వెర్రి వీర్రాజుకి. ఈ నోట్లు తీసి బయట అందర్కీ కనపడేటట్లు పట్టుకుంటే ఎవరైనా వస్తారేమో అనుకుని మాటిమాటికి లెక్కపెట్టడం మొదలు పెట్టాడు. అబ్బే యెవ్వరూ రావడం లేందే. వాడెవడో డబ్బులు మహా ష్టయిలుగా లెక్కపెడ్తున్నాడు. ఈ టౌను సంగతి యింకా తెలీదు గాబోలు అన్నట్లు చూస్తున్నాడో మాటుదారు.

"ఏం బాబూ డబ్బులు ఏమాత్రం దొరికాయి" ఎవడ్రా వీడని చూస్తే యిందాకటి రిక్షావాడే. "నావేన్రా.... వ .... పడిపోతే మరల తీసుకున్నాను. అయినా ఈ రోజుల్లో డబ్బులు పారేసుకున్నవాడెవడ్రా నీ వెర్రిగాని" అన్నాడే గాని ఆ రిక్షావాడు నమ్మినట్లులేదు. పోనీ పోలీసు స్టేషనులో చెప్పేద్దాం. అమ్మో బాబోయ్. రోజూ డబ్బు ఖర్చులు పెట్టించేస్తారు. అక్కడేదో జనం మూగినట్లున్నారు. డబ్బు పారేసుకున్నవాళ్లేమో. బయలుదేరాడు. 'ఏమిటండీ. ఏం జరిగింది ? "ఆఁ.... ఏం లేదండీ. అతనెవరో స్టూడెంటట. కాలేజీకి హాస్టల్‌కు డబ్బు కడ్తానని తెచ్చి సానింట్లో కెళ్తున్నాడట. వాళ్ల వాళ్లు నాలుగు తన్ని తీసుకుపోతున్నారు. అంతే ...." హమ్మయ్య, రక్షించావురా.... భగవంతుడా !

వో పెద్ద సందేహం పట్టుకుంది. మన వీర్రాజుకి. ఇప్పుడేం చేయాలీ డబ్బులు. పూర్తిగా బియ్యం బస్తా కొనేసుకుంటే... యిన్ని డబ్బు లెక్కడివిరా అని అమ్మడిగితే. దొరికాయంటే ఎవరయినా నమ్ముతారా? వో జత బట్టలు కుట్టించుకుంటే. డబ్బులు చాలడంలే దన్నాడు. బట్టలు ఎట్లా కుట్టించుకున్నాడ్రా అంటే. ప్చ్. ప్చ్. ఉదోకము పార్టీ యిచ్చేస్తే. అది కూడా నమ్ముతారా. పోనీ యేదైనా మంచి విలువైన వస్తువు కొనుక్కుంటే దాని పేరు మీదుగా ఉండిపోతుంది. ఊహూ ....అదీ లాభంలేదు. చిన్నప్పట్నించీ సినిమా అంటే చాలా సరదా. ఎన్నాళ్లయిందో సినిమా చూసి. వీళ్లిద్దర్నీ తీసుకుపోదాం అని లక్షన్నర ఆలోచనలు చేసి, తన యీ అమూల్యమైన మెదడుని చిత్రవధ చేసి తన మిత్రులిద్దర్నీ సలహా అడగాలని నిశ్చయించుకున్నాడు మన వీర్రాజు.

'ఏంచేద్దాంరా మూరీ." "ఒరే రాజూ! నన్నడిగితే ముగ్గుర్కీ సమానంగా పంచాలా."

"అయితే యిందాకటి రిక్షావాడో మరి"

"వాడూ సెందుకురా. వాడెప్పుడో పోయాడు."

"బాగుంది గాని నాకు చిన్న భయం వస్తుందిరా."

"ఏమిట్రా నీ భయాలు సందేహాలూ నువ్వూను."

"ఏంలేదురా. అన్యాయంగా వచ్చింది మరల ఎప్పుడైనా అలాగే పోతుందంటార్రా మన పెద్దలు. అంచేత దేవుడు డబ్బిలో పడేస్తే పాపం పారేసుకున్నవాడి ఆత్మకు శాంతి కల్గిస్తాడేమో దేవుడు"

"ఛ.... ఛ .... ఛ .... వెధవ తెలివి తక్కువ నువ్వూను. అసలు నీకు ఈ వీర్రాజని పేరెవరు పెట్టార్రా. పిరికి వెధవా, నీంత భయం అయితే నా కిచ్చేయిరా, నేను ఖర్చుపెడతాను."

'వద్దురా. నే నివ్వను. మా యింటికి పోయి ఆలోచిద్దాంరా."

* * *

"బాబూ మీకాళ్లట్టుకుంటాను బాబూ! వారం రోజుల్నుండి అన్నం తిని యెరగం బాబూ. బియ్యం దొరకడంలేదని మా అమ్మ నాగుజోడు తాకెట్టెట్టాను బాబూ. ఇప్పుడే గంటయింది బాబూ. కావాలంటే సెట్టిగారింటికి రండి బాబూ బుజువిప్పిస్తాను. ఇక్కడ బియ్యం దొరుకుతాయని వచ్చాను బాబు. దొమ్మిగా ఉందని స్టేషన్కు పోయాను. టిక్కెట్టుకు డబ్బులు తీదామని మొలంతా తడిమినా డబ్బుల్లేవు బాబూ. మీరు పోలీసోల్లు. ఎలాగైనా డబ్బులు వెతికిప్పించండి బాబూ. లేకపోతే యిక్కడ్నే నా ప్రాణాలు పోతాయినాయ్నా. ముసలిదాన్ని కోపగించకండి తండ్రీ. ఇనస్పెట్టు బాబూ. నీ తల్లిలాంటిదాన్ని. రక్షించండి తండ్రీ." ప్రక్కనున్న పోలీసు స్టేషను దగ్గర ఎవరో ముసలమ్మ పల్లెటూరునుండి వచ్చినట్లుంది. లబోదిబోమని యేడుస్తుంది. ఎన్నాళ్లనుండో దుమ్ముపట్టిపోయిన వీర్రాజు యీ యేడ్పు వినటంతో చెవులు దుమ్మంతా యెగిరిపోయింది గబగబా పరుగెత్తాడు. ఆ అవ్వ ఇనస్పెక్టరుగారి కాళ్ల దగ్గర పడి ఒకేలాగ ఏడుస్తుంది. వీర్రాజు తా మూహించుకున్నదంతా ఏమయిపోయిందో ....

"అవ్వా నీ డబ్బులన్నీ చెప్పగలవా."

"చెప్పగలను తండ్రీ."

"మొత్తం ఎన్ని రూపాయలు."

"నలభై అయిదు రూపాయలు బాబూ"

"ఇంకా చిల్లరేమైనా ఉందా."

"మరేలేందు నాయనా. అప్పు కాయి తాలే."

"ఇన్స్పెక్టరుగారూ, ఇదిగో డబ్బులు గేటు దగ్గర దొరికాయి." అని ధైర్యంగా యిచ్చేసాడు వీర్రాజు. అతని యెదుటే లెక్కపెట్టి అతని చేతిమీదుగానే యిప్పించే

పాపం వీర్రాజు

సారు యిన్స్పెక్టరుగారు.


"నీ పేరేమిటి నాయనా. మళ్లా జన్మలో కొడుకు పుడితే నీ పేరు పెట్టుకుంటాను."

"నా పేరు వద్దవ్వా. జాగ్రత్తగా కట్టుకుని యింటికి వెళ్లిపో. వస్తానండీ ఇన్స్పెక్టరుగారూ. బియ్యం పర్మిటు తీస్కోవాలి. పదండర్రా పోదాం....." అని యిటు తిరిగాడు వెర్రి వీర్రాజు. మిత్రులేరీ ?

'తాలూకాఫీసు కట్టేసారండి.'

దూరంనుండి వో కంఠం. ●

పర్వతావిర్భావ గాథలు



-డొక్షరి-

వెనకటికి నలుగురు గుడ్డివాళ్ళు గుంపుగా ఏనుగును ‘చూడ’డానికి వెళ్లేరట. కాళ్ళు తడివినవాడు ‘ఏనుగంటే ఏమిటో అను కున్నాను, స్తంభము’ అన్నాడట. రెండో వాడు చెవిని తడవి ‘ఏనుగు చేట’ అన్నా డట. మూడోవాడు తోక తడవి ‘చీపురు’ అన్నాడూ, నాలుగోవాడు తొండము తడవి పంపోక టన్నాడు. మావటి వాడు వీరం దరు చెప్పినవీ దేని కది నిజమే అయినా మొత్తంగా ఏదీ సత్యము కాకపోవడము గుర్తించుకుని నవ్వుకున్నాడట, కళ్ళు గల వాడు.

పర్వతాలు ఎలాగ ఏర్పడ్డాయీ? అన్న ప్రశ్నకి చాలా జవాబులు వచ్చాయి. ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికాల పశ్చిమ తీరము వెంబడిని రాకీ పర్వతశ్రేణి ఉంది. మెక్సికో తోక వెంబడినీ, పశ్చిమ ఇండియా దీవుల ద్వారా అట్లాంటిక్కుకి అడ్డంగా మొరాకో, ఇటలీ, టర్కీ, హిమాలయాలూ, బర్మా, మలయా, సుమత్రా, జావా, న్యూగినీలలో నుంచి పర్వతశ్రేణి సాగుతోంది. ఇవన్నీ ఎలాగ ఏర్పడి ఉండవచ్చునూ? అమెరికా వాయువ్య దిశలో అల్యూషియన్ దీవులూ, కాముచ్ కాట్కా జపాను దీవులూ, సముద్ర గర్భము, ... న్యూగినీల ద్వారా ఉన్నాయి పర్వతాలు, ఇవి అగ్ని పర్వతాలు కూడాను. ఇవి ఎలాగ ఏర్పడి ఉంటాయి? ఏనుగువంటి పెద్ద జంతువును గురించి చెప్పేటందుకు అంధుల స్పర్శేంద్రి యము మాత్రము చాలనట్లుగానే పర్వ తములనుండి సంశ్లిష్ట రూపాల్ని వ్యాఖ్యా నించడానికి శాస్త్రజ్ఞుల ఏకముఖసాక్ష్యాలు చాలలేదు. సముద్ర గర్భములో భూమి గురుత్వాకర్షణను కొలవగల సాధనమును నిర్మించిన నెదర్లాండ్సు విజ్ఞాని వెనింగ్ మీనెజ్ అల్యూషియన్ దీవులనుంచి ఆస్ట్రే లియా చేరువగల బండా సముద్రము వరకూగల అగ్నిదీవులకు తూర్పున సముద్ర గర్భంలో ఉన్న కందకాల్ల పొడుగునా భూ మ్యాకర్షణ శక్తి తగ్గి ఉండడమును కొలిచి చూచాడు. ఆ నరకులన్నవి భూమి యొక్క పైపొర, ఆకుంచనము (Contrac- tion) వల్ల భూమిలోనికి, సాంద్రతరమైన కింది పొరలోనికి, చొచ్చుకు పోవడముతో ఏర్పడిన వన్నాడు. నరకులలో సాంద్రవము లోపమువల్లనే భూమ్యాకర్షణ ఆ నరకుల పొడుగుతా తగ్గిందన్నాడు. ఈ లోయ రూపపు ముడతలలోకి ఇటూ అటూవున్న హీన సాంద్ర పృధివీ పదార్థము జారి, కూడి, ఆ తరువాత నొక్కుబడికి కొండలు కావచ్చు నటా, ఇప్పటికీ చాలా కొండలలోని పొరలు అలాగ నొక్కుబడిన చిన్నెలతో కానవస్తు న్నాయట. ఒక్కొక్క పరిస్థితిలో ఈ ముడత అడుగుటంచు భూగర్భపు వేడికి కరిగి, దాని దిగువనున్న శిలాద్రవము పైకి చిమ్ముకువచ్చి, చల్లారి గట్టి సేనపు రాతి కొండలుగా ఏర్పడతాయుట. సముద్రాల లోనూ, భూమిమీద చాలా చోట్లా కాన వచ్చే సేనపు రాతి గుట్టలు ఇలాగే ఏర్పడి ఉండవచ్చునుట. అయితే అగ్ని పర్వతాలనూ సముద్ర గర్భ భూవికృతులనూ ఈవాదము వివరించజాలదు.


వెజినర్ అన్న జర్మను భూగర్భ విజ్ఞాని దక్షిణ అమెరికా తూర్పుతీరానికీ ఆఫ్రికా పశ్చిమ తీరానికిగల సామరస్యాన్ని పురస్కరించుకుని (భూ)ఖండములన్నీ సేలి యోజోయిక్ యుగములో కలిసి ఒకే పేద భూఖండముగా ఉండేవనీ, అవి చీలి—చీలి బల్లచెక్కలు నీటిమీద జరిగివేర్లై నట్లు జరిగి ఇప్పటి రూపానికి వచ్చా యనీ అన్నాడు. ఎటువైపు జరిగితే అటు వైపు అంచున ఏర్పడ్డభూమి ముడతలట పర్వతశ్రేణులు. భూమిపై పొరలలో తేలికైన సిలికాను అల్యూమినియము సంయోగాలూ, అడుగున బరువైన సిలికాను మెగ్నీషి యము సంయోగాలూ ఉండడమును ఉప యోగించుకున్నాడూ, రాకీ పర్వతశ్రేణి, హిమాలయాలూ అంత దీర్ఘములూ, క్లిష్టములూ అయిన శ్రేణులుగా ఏర్పడ డానికి ఈ జరుగుడును చక్కగా అన్వ యించాడు. అయితే ప్రపంచంలో వేర్వేరు దేశాలలోవున్న పర్వతశ్రేణులు ఏర్పడడానికి ఆదేశాలు వేర్వేరు దిశల వైపు జరిగేయి అనాలి. పెద్ద పెద్ద పర్వతశ్రేణులు ఏర్పడ్డ రీతిని నమ్మగలిగినట్లు వివరిస్తున్నా, మొత్తపు పర్వత జనన వివరణకి ఈ ఖండ ప్రచలనవాదము చాలకవస్తుంది......కొండ రాళ్లన్నిటా రేడియో తీవ్రతగల ధాతు వులుండడమును ఉపయోగించి, ఈ ధాతు వుల విచ్ఛిన్నమువల్ల జనించే వేడికి భూమి రెండో పొర కరిగితే, ఆ ద్రవము మీది పై పొర సముద్రపు పోటు తాకి



వైజ్ఞానిక గాధాశతి

డికి పడమరకి జరగగల దంటాడు జొలీం. ఘనీభవించే రెండో పొర పైపొరను పైకి ఎత్తేస్తుందటా, అది అంచుల దగ్గర నొక్కులు పడిపోతుందట. ఆ నొక్కులట ఖండాల అంచున గల రాకీ పర్వతాలవంటివి. భూభాగాలలోకి సముద్రము చొచ్చుకుపోడాన్ని చక్కగా వ్యాఖ్యానిస్తుంది ఈ వాదము. కాని సరుకులూ అగ్ని పర్వతాలో? అవి ఈరకపు ప్రచలనమువల్ల ఎలాగ ఏర్పడగలవు?

భూమి పొరలు జరిగి ముడతలు పడడానికీ, భూగర్భమునుంచి పృధివీ వస్తువు పై పొరను ఎత్తేటట్టుగానీ, దాన్ని చీల్చి పొడుచుకువచ్చేటట్టుగాన్నీ చేయగల కారణాలకోసము భూగర్భ శాస్త్రజ్ఞులూ భూభౌతిక శాస్త్రజ్ఞులూ ఖగోళశాస్త్రజ్ఞులూ వెతుకుతూనే ఉన్నారు. భూమి పైపొరలు పలాచగావుండ, జారడమువల్ల ముడతలు పడతాయని ఒకరూ, భూగర్భమునుంచి పైకి ఉబికి వచ్చే నీటివల్ల గుట్టలలోని మట్టి వస్తువు ఉబ్బి, వింటి బద్దల రూపానికి వంచుతాయనీ, అవే మనము చూచే అల్యూషియన్లూ జపాన్ దీవులువంటి ద్వీప సమూహాలు అని ఇంకొకరూ, 'వారి అవలోకనాలే మరొకలాగు వివరించవచ్చును' అని ఎదురు వాదము నిర్మించే వారొకరూనూ అవుతున్నారు. గుట్టలలో భూమి పొరలు ముడతలుపడి ఉండడమూ, అగ్ని పర్వత శీలమూ, పర్వత శ్రేణుల ఆవిర్భావమూ, రూపమూ, సముద్రాంతర భూకందకాలూ, భూమ్యాకర్షణ కొలతలూ, భూమ్యుపరిభాగ వైవిధ్యమూ, పర్వత గర్భ నిర్మాణమూ, రేడియో తీవ్రతా, ఆయస్కాంతమత్వమూ, ధ్రువముల స్థానములూ, ఇంకా ఎన్నో గుణాల వికృతీ, విస్తృతీ పరిశీలించి సమన్వయముచెయ్యాలి. పర్వతాల ఆవిర్భావాన్ని వివరించాలంటే అంధులకు ఏనుగు వర్ణనకంటె వైజ్ఞానికులకు పర్వతావిర్భావ వర్ణన కష్టతరము. అవలోకన సామగ్రి ఇంకా కావాలి. ●


ఐరోపా, అమెరికాలకు ఎగుమతి నిమిత్తం ప్రత్యే
కంగా సృష్టితమై బయల్పరచబడ్డ సౌఖ్యానంద
కరమైన సబ్బు, ఇపుడు ఎన్నికగా భారతదేశంలో
అమ్మకమగుచున్నది!
గోద్రెజ్ సాండల్...శుద్ధమైన మైసూర్ చందన
నూనె నుండి నైపుణ్యంగా మిశ్రమం చేయబడిన
ఉల్లాసకరమైన ప్రశస్తమగు నిలవుండే పరిమళం
గలది...ఇట్టి వాటిలో చాలా కాలం నిలవుండే
చాలా పెద్ద సబ్బు నేడే దీనిని వాడి చూడండి.
దాని హాయిగొలిపే పరిమళం మీ కెంతో
ప్రీతిమైనది!
గోద్రెజ్ సాండల్
...అందరూ ఆనందించగల సౌఖ్యదాయకం
సమర్పితం
క్రొత్త
గోద్రెజ్
సాండల్
Sandal
LUXURY SOAP
Godrej
గోద్రెజ్
సబ్బులలో
ఉత్తమ
నామము
SDL. 1A-TEL.

సీరియల్



నిరీక్షణ

ఉన్నవ విజయలక్ష్మి

జరిగిన కథ

జీవితంమీద విరక్తితో ఆత్మహత్య చేసుకోబోతున్న రాధను, రక్షిస్తాడు ఆ ఊరి డాక్టర్ వేణు. వేణుకు తన దయనీయ జీవితగాథనంతా వినిపిస్తుంది. రాధ చిన్నతనంలో తండ్రిని కోల్పోతుంది. స్కూలు ఫైనలు ప్యాసయిన రాధను ఒక మంచి సంబంధమే అనుకుని, భాస్కరానికిచ్చి పెళ్లి చేస్తాడు అన్న ప్రకాశరావు. అనుకోని విధంగా ఒక ప్రమాదంలో భాస్కరం మరణిస్తాడు. రాధకు అన్నగారింట్లో కూడా ఆదరణ కరువవుతుంది. కూతురిని గురించిన బెంగతోనే తల్లి శాంతమ్మ ప్రాణాలు విడుస్తుంది. ఆంజనేయులు రాధపై అభాండాలను సృష్టిస్తాడు. రాధను తనవెంట తీసికెళ్లి ఉద్యోగం ఇప్పిస్తానని ఊరడిస్తుంది పార్వతి. వేణు తనను వివాహం చేసుకోమని కోరిన సంగతి పార్వతికి చెప్పుతుంది రాధ. క్షణికోద్రేకానికిలోనై హద్దులు అతిక్రమిస్తారు రాధ, వేణు. భయపడాల్సిన అవసరంలేదనీ, తాను ఆమెను తప్పక వివాహం చేసుకుంటాననీ చెప్తాడు వేణు. వేణు వద్దనుంచి ఉత్తరం రాలేదని రాధ కలవర పడుతున్న సమయంలో, అతని ఉత్తరం ఆంజనేయులు చేతిలో పడుతుంది. రాధ ఆంజనేయులుతో వెళ్లిపోయిందని ఊరంతా గుప్పుమంటుంది. వేణు హతాశుడవుతాడు.

10

పార్వతి భావ వీధిలో ఏదో తళుక్కున మెరిసినట్లయింది.

"అంత అతిచనువెందుకిచ్చావు రాధా. నువ్వు చెప్పినదాన్ని బట్టి అతనెంతో మంచివాడని అనుకున్నాను. నువ్వయినా అతన్ని పూర్తిగా అర్థంచేసుకోడానికి ప్రయత్నించవలసింది" అంది సానుభూతితో రాధ తల నిమురుతూ.

"ఆయనలాంటివారు కాదు పార్వతీ. ఆయనతో పరిచయం అయివుంటే నువ్విలా మాట్లాడేదానవు కాదు. ఏమైనా అంత హద్దులుమీరి అతి చనువుగా ప్రవర్తించలేదు మొదట్లో.

"కాని ఒక పొరపాటు జరిగిపోయింది. అసలు నేనానాడు వాళ్లింటికి వెళకుండా ఉండాల్సింది. నువ్విక్కడికి వచ్చేసిన మరునాడే నా పుట్టినరోజుకదా. ఈ నాలుగేళ్ల నుండి పుట్టినరోజు పండగ చేసుకోవడమే మానేశాను. ఆదేమిటో యాదాలాపంగా వారితో చెప్పాను ఆనాడు పుట్టినరోజని. ఏ ఏదైనా హోటలుకి తీసుకెళ్లి పార్టీ యిస్తానన్నారు. నే నిష్టపడలేదు. వాళ్లింటికైనా వచ్చి భోజనం చేయమని బలవంతపెట్టారు. ఆయనంత అభిమానంగా పిలుస్తుంటే కాదనలేకపోయాను.

"నా పుట్టినరోజుకి బహుమతి ఏదైనా ఇవ్వాలనుందని ఇదుగో ఈ ఉంగరం నా వ్రేలికి తొడిగారు. ఆ క్షణం ఎలాంటిదో, మా మనసులు మా స్వాధీనంలో లేక పోయాయి.

"ఆనాడే మానసికంగా మా వివాహం జరిగిపోయిందని, అందుకు దైవమే సాక్షి అని కొంచెం కుంకం తీసి నా నొసట దిద్దారు.

"ఆ మరునాడే వారు బయలుదేరి వూరికి వెళ్లారు. అక్కడెటువంటి పరిస్థితిలో చిక్కుకున్నారో, వాళ్ల వాళ్లు అనుమతించలేదో, లేక వారికేం ఆపద వచ్చిందో, నాకేమీ తోచడంలేదు. ఇంకా కొన్నాళ్లు అక్కడే ఉంటే ఏ సంగతీ తెలిసేదేమో. కాని, నీకు తెలుసుకదా, ప్రకృతి కూడ స్త్రీజాతిమీదే పగ సాధిస్తుంది. నలుగురికీ తెలిసిపోతుందేమోనని భయంవేసి యిలా పారిపోయి వచ్చేశాను. ముందు కర్తవ్యం ఏమిటో నువ్వే నిర్ణయించాలి." అంది పొంగివస్తున్న దుఃఖాన్నాపుకోడానికి ప్రయత్నిస్తూ.

"నువ్విక్కడున్నట్టు మీ అన్నయ్యకి వ్రాశావా? లేకపోతే వాళ్లు నిన్ను గురించి ఇంకెలాగైనా వూహిస్తారేమో."

"వద్దు పార్వతీ. వాళ్లెలా అనుకున్నా సరే. ముందు వారి సంగతి తెలిసిందాకా నేనిలా అజ్ఞాతంగానే ఉండిపోదలచుకున్నాను. ఈలోపుని నాకేదైనా బ్రతుకు తెరువు చూపించలేవా? అసలు నే నిక్కడుండడం నీకూ ఇబ్బందిగా ఉంటుందేమో."

"ఛ. అలా ఎప్పుడూ అనుకోకు. నువ్వు చెప్పిన మాటలనుబట్టి అతను తప్పకుండా వస్తాడనే నాకూ ఆశ కలుగుతోంది. అతనికైనా నువ్విక్కడున్నట్టు తెలియజెయ్యి. "ఈలోపుని తొందరపడి ఉద్యోగంలో చేరాలనుకోకు."

"నిజమేలే. అసలేమిటో ఉద్యోగం చెయ్యడానికి పోతుందేమో నన్నట్టు మంచీ చెడ్డా ఆలోచించకుండా తొందరపడి వచ్చేశాను. ఇంకో పదిరోజులు అక్కడే ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా గడిపి వేయాల్సింది.

వాళ్ల అమ్మగారు అంగీకరించలేదేమో వాళ్ల నెదిరించలేక నిన్ను మరచిపోవడానికే నిశ్చయించుకున్నారేమో ననే భయం నన్నావహించింది. నాచేత యిలాంటి తెలివితక్కువపని చేయించింది.

"వారికివాళే ఉత్తరం వ్రాస్తాను ఆస్పత్రి ఎడ్రసుకి."

"వెంటనే వ్రాసెయ్యి. లేకపోతే మీవాళ్ల వలన నీ సంగతి తెలుసుకుని నువ్వేమయి పోయావోనని ఆందోళనపడుతూంటాడు. నీ ఉత్తరం చూసుకుంటే ఇక్కడికే వస్తాడు."

"సరే నువ్వు స్నానంచేసి కాసేపు ప్రశాంతంగా పడుకో" అంటూ వో గదిలోకి తీసుకెళ్లింది. అక్కడో మంచం, పక్క, రాధ తెచ్చుకున్న పెట్టె సంచీ ఉన్నాయి.

"నువ్వు రోజూ బొట్టు కూడా పెట్టుకుంటూండు రాధా. ఇలా ఉంటే అందరికీ అనుమానం కలుగుతుంది. అసలయినా

మన్నాటినుండి రోజా బొట్టు పెట్టుకుంటూ ఉండవలసింది.''

"నిజమే. ఇప్పుడు చాలమంది పెటుకుంటూనే ఉన్నారు. నేనేమిటో మొదటో మానేసినదాన్ని, ఇప్పుడు మళీ మొదలు పెడితే నలుగురూ ఏమనుకుంటారోనని భయపడాను. ఆ మరునాడు తిలకంలేని నా మొఖాన్ని పదేపదే అద్దంలో చూసుకుని ఎంతో బాధపడ్డాను. నే నలా ఉండడం వలన వారి కేదె నా కీడు జరుగుతుందేమోనని భయపడ్డాను కూడా. కాని ఏం చేయను ? నా కోరిక మనస్సులోనే అణచుకున్నాను.''

"ఇక్కడ నీ కలాంటి గొడవలేం ఉండవులే.''

బాత్‌రూమ్‌లో వేడినీళు న్నాయి వెళు. నేను వంట పూర్తి చేసా ను ఈలోపుని'' అంటూ పార్వతి వెళిపోయింది.

రాధ తల దువ్వుకుని స్నానంచేసి వచ్చి నొసట నిండుగా తిలకందిదుకుంటూంటే పార్వతి వచ్చింది గదిలోకి. స్నేహితురాలిని చూసి సిగు పడుతూ తల వంచుకుంది రాధ. విశాలమైన పాలభాగాన సౌభాగ్యచిహ్నమైన కుంకుమరాగంతో, ద్విగుణీకృతమైన సౌందర్య శోభతో రాగరంజితమైన ఆమె ముఖాన్ని రెండురెండు చేతులలోకి తీసుకుని "నిన్నిలా కళకళలాడుతూ చూసి ఎన్నేళ్ళయింది రాధా.'' అంది ఆప్యాయంగా పార్వతి.

గతం ఒక్కసారి స్మృతిపథం ముందు మెదిలి రాధ కళు చెమర్చాయి. అది పార్వతి కంట పడకుండా తల తిప్పుకుని, "పద నీకు వంట కూడ కాలేదేమో. నేను కూడా సాయం చేసా '' అంది.

"అబ్బే. నువ్వెందుకూ. అసలు నా పని కూడ అయిపోయింది'' అంటూంటే వాకిట్లో కారాగిన చప్పుడయింది.

"ఎవరు వచ్చారు ?'' అనుకుంటూ గదిలోంచి ఇవతలకి వచ్చిన పార్వతికి భర్త రఘునాథరావు ఎదరయాడు నవ్వుకుంటూ.

"అప్పడే వెళ్లిన పని అయిపోయిందా ?'' అంది.

"బయట ఎండ మరీ నిప్పులు చేరిగేసోంది. మిగతా పని సాయంత్రం చూసుకోవచ్చునని వచ్చేశాను.'' అంటూ మేడ మీదికి దారి తీశాడు.

పార్వతి కూడ అతన్ననుసరిస్తూ "రాధ వచ్చిందండీ'' అంది నెమ్మదిగా.

తల వంచుకుని బూట్లు విప్పుకుంటున్నవాడల్లా చటుక్కున తలెత్తి పార్వతి మొఖంలోకి చూశాడు అర్థం కానట్టు.

"అదే మా స్నేహితురాలు రాధని గురించి చెప్పానుకదూ అప్పుడు. తను వచ్చింది ఇంతకుముందే.''

"ఆవిడ పెళ్ళి చేసుకోబోతున్నారని చెప్పావుకదూ. పాపం ఏం జరిగింది'' అన్నాడు సానుభూతి చూపిస్తూ.

"ఏవిటో ఖర్మ పాపం'' అంటూ జరిగిందంతా చెప్పింది పార్వతి.

"ప్చ్. మరేం చేద్దామని.''

"ఇవాళే అతనికి ఉత్తరం వ్రాస్తోంది. అది అందగానే ఇక్కడికి వస్తాడనుకుంటున్నాను.''

"అతనే, ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంటే ?'' అన్నాడు భార్య మొఖంలో భావాలు చదవడానికి ప్రయత్నిస్తూ.

"ఆ ఇందిరమ్మగారిని కలుసుకుని టీచరు పోస్టు రాధకే యిచ్చేలా చూడాలి. మన నీడని తన బ్రతుకు బ్రతకగలదు'' అంది నిబ్బరంగా.

"దీనివల్ల ఎలాంటి చిక్కులొస్తాయో ఆలోచించావా ? అమ్మా వాళకి తెలిసే ఏమైనా అనుకుంటారేమో. ఆ విషయా



స్నీ నువ్వే ఆలోచించుకో. నా మట్టుక్కి నాకేం అభ్యంతరంలేదు. అవసరం అయితే నా చేతనయిన సహాయం చెయ్యడానికి కూడా నేను తయారుగా ఉన్నాను."

"మీరు ఆ మాత్రం సహకరిస్తే చాలు. ఇప్పట్లో అత్తగారు వాళ్ళు ఇక్కడికి రారుకదా. అంతగా వస్తే అప్పటి కేదో చెప్పొచ్చు. అసలు అంత అవసరం కలుగుతుందని నే ననుకోలేక పోతున్నాను. ఏదో యిబ్బంది వచ్చిందనీ, కొద్ది రోజుల లోనే వేణుగోపాలరావు వస్తాడనీ నాకు గట్టిగా నమ్మకముంది."

"అదే నిజం కావాలని నేనూ కోరు కుంటున్నాను" అన్నాడు ఆప్యాయంగా భార్య భుజం తట్టుతూ.

రఘు బట్టలు మార్చుకుని కాళ్ళు చేతులు కడుక్కుని వచ్చేసరికి ముగ్గు రికి కంచాలు పెట్టి వడ్డన చేసింది పార్వతి.

"ఆవిడ్ని కూడ పిలు మరి." అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

"నాకు అన్నయ్యగారి మొఖం చూడ్డానికి ప్రాణం చచ్చిపోతోంది. మీ యిద్దరి భోజ నాలు కానివ్వండి. నేను తరువాత పెట్టుకు తింటాను." అంది రాధ.

"ఛ, సిగ్గేమిటి ? పరిస్థితంతా వారు కూడా అర్థం చేసుకున్నారు. ఏమను కోరు. రా." అంటూ బలవంతంగానే రాధను వెంటబెట్టుకు వచ్చింది పార్వతి.

రఘుని చూస్తూనే రెండు చేతులు జోడించి "నమస్కారమండీ" అంది రాధ తలొంచుకునే. రఘు ప్రతి నమస్కారం చేశాడు.

"మీకందరికీ చాలా శ్రమ యిస్తు న్నాను" అంటే మళ్ళీ. అవమానం, ఆవే దన స్పష్టంగా ధ్వనిస్తున్నాయి ఆ గొంతులో.

"మీరలా ఎప్పుడూ అనుకోవద్దు. కొద్ది రోజులలో పరిస్థితులన్నీ చక్కబడ తాయి. అందాకా మాత్రం మీరు ధైర్య ముగా ఉండాలి."

"పార్వతికి తగిన భర్త" అనుకుంది రాధ.

నిరీక్షణ

రాధ ఏమీ తినకపోవడం చూసి, "మీరలా మొహమ్మాట పడితే లాభం లేదు. మేము భోజనం దగ్గర కూర్చుంటే ప్రక్కవాళ్ల సంగతి మరచిపోయి మా ధోరణిలోనే పడిపోతాం. మిమ్మల్ని కను క్కునేవాళ్లు కూడ ఉండరు. ఇది మీ స్వంత అన్నయ్య ఇల్లే అనుకుని కావలసి నవి మీరే వడ్డించుకు తినాలి. ఇక్క డంతా సెల్ఫు హెల్ప్" అన్నాడు నవ్వుతూ, కూర ప్లేటు రాధ ముందుకి తోస్తూ. పార్వతి కూడ నవ్వేసింది.

అతని ఆత్మీయతకి రాధ కళ్ళు చెమ ర్చాయి. "మా మధ్య ఈ సౌహార్దము, ఆత్మీ యత ఎప్పటికీ ఇలాగే ఉండేలా అనుగ్ర హించు భగవాన్!" అనుకుంది.

* * *

ఆఫీసు రూమ్‌లో కూర్చుని అప్పుడే వచ్చిన పోస్టు చూసుకుంటున్నాడు రఘు. అందులో ఒక కవరుమీద అతని దృష్టి పడింది. అది రాధపేరున రిజిస్టరు చేయ బడిన ఉత్తరం.

"అయ్యో. ఎంతపని జరిగింది." అని బాధపడ్డా డతను. నెమ్మదిగా పార్వతిని పిలిచి ఉత్తరం యిచ్చాడు.

"ఇదేమిటి ?" అంది ఆమె ఉత్తరం చూసి నమ్మలేనట్లు.

రఘు దగ్గరనుండి ఎలాంటి సమా ధానం రాలేదు.

"అతనిన్నాళ్ళు శలవలో ఎందు కుంటాడు ? ఒకవేళ అతనే ఉత్తరం తీసుకోడం యిష్టంలేక తిప్పి పంపించేశా డేమో. మీకెలా అనిపిస్తోంది" అంది అయోమయంగా అతనివంక చూస్తూ.

"అతనింకా శలవలో ఉంటే ఉత్తరం అక్కడే ఉంచేవారు. అతను రిజైన్ అయినా చేసుండాలి లేక ఇష్టంలేక తనే ఆ ఉత్తరం తిప్పి పంపించి ఉండాలి.

"ఇంక ఇప్పుడామె ఏంచేస్తుంది పాపం."

"ఏం చేసుంది. మళ్ళీ అన్నగారింటి కెళ్లనని చెప్పేసింది. ఇందిరమ్మగారితో మొన్నే చెప్పి ఉంచాను ఎప్పుడేం అవసర మవుతుందోనని. ఆ ఉద్యోగం చేసుకుంటూ ఇక్కడే ఉండిపోతుంది. మొదట ఆశ్రయం ఇచ్చినట్లే యిచ్చి, యిప్పుడు మనం మాత్రం ఎలా వెళ్లిపొమ్మంటాం ?"

"సరే నీ యిష్టం" అని మిగిలిన ఉత్తరాలు చూసుకోడంతో మునిగిపోయా డతను. "అనవసరంగా లేనిపోని బెడద తెచ్చి నెత్తిన పెట్టుకుంది పార్వతి." అన్న విసుగుదల కలిగిం దొక్క క్షణం.

"రాధకి వేణుగోపాలరావుతో వివాహం జరిగి, తరువాత ఏ కారణాలచేతనైనా అత నామెని వదిలిపెట్టేసివుంటే ఆమెకి నా ఆశ్రయం యివ్వడానికి నా కెలాంటి అభ్యం తరం ఉండేది కాదుగదా. ఇప్పుడూ అంతే అనుకోవాలి. కాకపోతే ఆ వివాహం రహ స్యంగా జరిగింది" అని సరిపెట్టు కున్నాడు మళ్ళీ.

పార్వతి ఉత్తరం తీసుకుని రాధ దగ్గ రికి వెళ్లింది. మౌనంగా ఉత్తరం చేతిలో పెట్టి రాధ ప్రక్కనే కూర్చుంది. తనకి ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో అని ఆలో చిస్తున్న పార్వతి ఆ ఉత్తరంమీద టపటపా రాలి పడుతున్న అశ్రుకణాల్ని చూసి.

"బాధపడకు అని నీకు చెప్పడానికి కూడ నాకు నోరు రావడంలేదు రాధా. అయినా నువ్వు కొంచెం ధైర్యం తెచ్చు కోవాలి. ఇలా ఎందుకు జరిగిందో నువ్వు కొంచెం అయినా వూహించకలవా ? అతను వచ్చిఉంటే ఉత్తరం తీసుకోకుండా ఉంటాడా ?" అంటూ ఇంకా ఏదో చెప్ప బోతూంటే మధ్యలోనే ఆమెని వారించి,

"అలా జరగదు పార్వతీ. వారికేదో ఆపద సంభవించి ఉంటుంది. ఏదైనా నుసీ చేసిందేమో. లేకపోతే నా గొడవంతా విని వాళ్లవాళ్ళు ఆవూరు రానివ్వలేదేమో" అంది ఎటో చూస్తూ.

"నీ కన్ని ఆశలు కల్పించి యింత అన్యాయము చెయ్యడానికి సిద్ధపడతాడా ? వాళ్ల వాళ్ళు వారిస్తే మాత్రం తన కర్తవ్యం బాధ్యత తెలుసుకోలేనంత పసి వాడేం కాదుగా. ఒక్కొక్కసారి అవసరం కలిగినప్పుడు పెద్దవాళ్ల నెదిరించవలసి

నిరీక్షణ

వస్తుంది. ఆమాత్రం ధైర్యం లేనివాడు అసలు ఇలాంటి సాహసం ఎందుకు చెయ్యాలి. వాళ్ళ మాట జవదాటకుండా! ఉద్యోగం మానేసి, బుద్ధిగా వాళ్ళు చూపించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని సుఖంగా ఉంటాడు కాబోలు.

"అతని ఫోటో చూసి, అన్నివిధాలా నీకు తగినవాడేనని నేనూ మీ అన్నయ్యగారు ఎంతో సంబరపడ్డాం. రూపు రేఖల్ని బట్టి గుణగణాలని నిర్ణయించబోవడం ఒట్టి తెలివితక్కువతనం. ఒక అమాయకురాలి జీవితంతో చలగాట మాడాననీ, ఇక ఆమె జీవితం అంతా అంధకారమే అలుముకుంటుందనే బాధ అతనికెందుకుంటుంది. నీ ఖర్మానికి నిన్ను వదిలేసి తను మాత్రం హాయిగా ఉంటాడు.

"ఒకనాడు తను చేసిన పాపానికి ఆ దైవాన్ని సాక్ష్యంగా పెట్టుకున్నాడు. దైవ సాక్షిగా జరిగిన మీ వివాహం శుభప్రదమూ ఆనందదాయకమూ కాలేకపోయిందివదని ఇక ఆ భగవంతుని ఉనికిని శంకించవలసి వస్తుంది" అని పార్వతి క్రోధావేశాలతో ఏమేమో అనేస్తుంటే, రాధ ఆమె రెండు చేతులు పట్టుకుని,

"వద్దు పార్వతీ. వద్దు. నాకోసం నువ్వు పాపి కురాలివి కూడ కావద్దు. నాకోసం నువ్వా దైవాన్ని నిందించి అపచారం చెయ్యవద్దు" అంది రుద్ధకంఠంతో. "ఇదంతా నా దురదృష్టం. దానికొకరిని నిందించి ప్రయోజనంలేదు." అంది అవిరళంగా చెంపలవెంట జాలువారుతున్న కన్నీటిని తుడుచుకోడానికి కూడ ప్రయత్నించకుండా.

"ఇప్పుడేం చేస్తావు. మీ అన్నయ్యకి ఉత్తరం వ్రాద్దామా పోనీ."

రాధ ఉలిక్కిపడి పార్వతి చెయ్యి పట్టుకుని,

"వద్దు. ఆపని మాత్రం చెయ్యకు. ఇంక ఈ జీవితం ఇలా అజ్ఞాతంగా గడిచి పోవలసిందే. నీకు కష్టంగా ఉంటే చెప్పు ఇంకెక్కడైనా వెళ్ళి ఉంటాను. ఆ ఉద్యోగం మాత్రం ఇప్పించు ఎలాగో." అంది బ్రతిమాలుతూ.

"నీ స్థితి చూసి బాధతో అన్నానే కాని, నాకు కష్టం ఏమిటి? ఆ రెండు గదులలోనూ ఉందువుగాని. ఉద్యోగంలో కూడా రేపటినుండే చేరవచ్చు." అంటూ పార్వతి ఇవతలికి వచ్చేసింది.

"పాపం తన కెంత అన్యాయం జరిగింది? ఎప్పటికయినా అసలు అతను రావడం రాధ సుఖపడడం అనేది ఉంటుందా? రాధ కూడ ఎక్కువ బాధపడుతున్నట్టు లేదేమిటి? ఆ ఉత్తరం చూడగానే తనలో దుఃఖం ఉప్పెనలా పొంగిపోతుందని, తనని ఓదార్చడం నావల్ల కాదేమోనని ఎంత భయపడ్డాను! అదేం లేకుండా ఎంతో నిబ్బరంగాను, ధైర్యంగానూ తన భవిష్యత్తుని నిర్ణయించుకుంది. ఇదీ కొంత నయమే" అనుకుంటూ ఏదో జ్ఞాపకం వచ్చి రాధకి చెప్పాలని ఆమె గదిలోకి వెళ్ళిన పార్వతి అక్కడి దృశ్యం చూసి చలించిపోయింది.

దోసిట్లో ముఖం దాచుకుని హృదయం పగిలేలా విలపిస్తోంది రాధ. పార్వతి వెళ్ళి ప్రక్కన నిలబడినది కూడ గమనించే స్థితిలో లేదు.

"ఈమెకి దుఃఖమే లేదా అని ఇంత వరకు ఎంత పొరబాటుగా అనుకున్నాను" అనుకుంటూ నెమ్మదిగా రాధ ప్రక్కన కూర్చుని ఆమె తల నిమురుతూ "వూరుకో రాధా, ఏడ్చినందువల లాభమేముంది?" అంది డగ్గుత్తికతో.

ఒక్కొక్కసారి సానుభూతి చూపించే వాళ్ళుంటే దుఃఖం ఇంకా ఎక్కువవుతుంది. ఇప్పుడు రాధ విషయంలో కూడ జరిగిందదే. పార్వతి ఒళ్ళో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ,

"ఇంకా నా బ్రతుక్కి ఏడుపుకాక మిగిలిందేమిటి? ఒకనాడు నాకతి సమీపంగా వచ్చిన మృత్యుదేవత కూడ వెనక్కి వెళ్ళి

పోయింది. నన్నిలా ఏడిపించడానికే నేమో" అంది.

పార్వతి ఉలిక్కిపడి, "నువ్వు నాకో మాట ఇవ్వాలి రాధా" అంది రెండు చేతులతో ఆమె మొఖం తనవైపుకి తిప్పుకుని సన్నటి కన్నీటిపొర గుండా ఆమె కళ్లల్లోకి చూస్తూ.


కొద్ది క్షణాలలో రాధ కొంచెం స్థిమితపడి, కళ్లు తుడుచుకుని,


"నువ్వడగబోయేది నాకు తెలుసులే. నీకా భయం ఏమి అఖ్ఖర్లేదు. చచ్చిపోయే దాన్నయితే ఇంతదూరం రాకనేపోదును. ఎలాంటి పరిస్థితులలోనూ కూడ ఆత్మహత్యకి తలపడనని ఒకనాడు నేను వారికి మాట యిచ్చి ఉన్నాను. అదీకాకుండా జీవిత పోరాటంలో పరాజయం పొంది ప్రాణాలు తీసుకోడం ఎంత అవమానకరమో నేనూ గ్రహించాను.


"అయినా నేనేం తప్పు చెయ్యలేదు. నాలో నాకు ఆమాత్రం విశ్వాసం ఉంది. వారు ఒకనాటికైనా నన్ను వెతుక్కుంటూ వస్తారనీ, వారి ప్రతిరూపాన్ని వారి కప్పగించే అదృష్టం నాకు కలుగుతుందనీ— ఏదో ఆశ నా నరనరంలోనూ పాదుకుపోయింది. ఆ ఆశే నా జీవితానికి మార్గదర్శి. ఆ ఆశాజ్యోతి పరచిన వెలుగుబాటలో నా భవిష్యత్తుని వూహించుకుంటూ వారి నిరీక్షణలోనే ముందు జీవితం అంతా గడపగలను" అంది ఏో విధమైన వ్యధా, ఆశా భావాలు మిళితమైన స్వరంతో.


"నిజం రాధా. అతనిపట్ల నీకు గల ఈ అచంచల విశ్వాసమే నీకు శ్రీరామరక్ష. నిన్ను అన్యాయం—చెయ్యడానికి ఆ భగవంతుడు కూడా సాహసించలేడు. ఒకనాటికి అతను తప్పక వస్తాడు. నీ జీవితం సార్థక మవుతుంది." అని రాధకి ధైర్యం చెప్పి "సాయంత్రం ఒకసారి వెళ్లి ఆ ఇందిరమ్మగారిని కలుసుకువద్దాం" అంటూ తన పనులు చూసుకోడానికి వెళ్లిపోయింది పార్వతి.

(సశేషం)


అచ్చుదిద్దినట్టే కుదిరిందయ్యా జంట! పెళ్ళంటే ఇదీ పెళ్ళి!


చిరంజీవి సుఖీభవ! నూనోముల పంటగా వర్ధిల్లాలి


అదృష్టంకొద్ది అల్లుడవయ్యావు! కోరుకో బాబూ! కారా? బంగాళా?.... .. ..


.........వద్దండి.


మనం రైతులం క్రిషి పవర్‌టిల్లర్ ఇవ్వండి. మా జంటకు అదే నిజమైన కానుక! మా వ్యవసాయానికి అదే కరదీపిక!
KIRON

మేషం : ఈవారం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందకపోవడం వలన లాభించే వ్యవహారాలను కూడా వాయిదా వేయవలసి వస్తుంది. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు కొంచెం శ్రమ మీద నెరవేరుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతిపక్షాల వాదం బలహీనపడే సంఘటనలు జరుగుతాయి. ఆరోగ్యం బాగా ఉంటుంది. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు వస్తాయి.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరుతాయి. సంతోషకరమైన మార్పులు వస్తాయి.

వృషభం : మీ స్వంత పనులమాట యెలాగున్నా యితరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు మాత్రం సులువుగా నెరవేరుతాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాల్లో యిదివరకు యేర్పడిన చికాకులు తొలగిపోతాయి. వృత్తిలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. స్థిరాస్థి వ్యవహారాల్లో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు ఫలించగలవు. కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మిథునం : వృత్తివ్యాపారాల్లో ఆదాయం పెరిగినా దాని నిమిత్తం మీరు పొందిన శ్రమతో పోల్చినప్పుడు యీ వారం సంతృప్తికరంగా ఉండదు. వృత్తిలో మీకు ముందు ఉపయోగించగల వ్యక్తులను కలుసుకొంటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. సాంఘిక కార్యక్రమాల్లో మెప్పుకురాని కార్యభారాన్ని వహించవలసి వస్తుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం : ఈ వారం చిత్రంగా ఉంటుంది వ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును కాని మొత్తంమీద ఆదాయం మాత్రం బాగా ఉంటుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో మిత్రుల సహకారం లభిస్తుంది. ఆర్థికంగా మీ స్వంత వ్యవహారాలు బాగానే ఉన్నా, యితరుల నిమిత్తం శ్రమ కలుగుతుంది. కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా నెరవేరతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు.

సింహం : వృత్తివ్యాపారాల్లో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభించడంవలన అధికాదాయంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా లభించగలదు. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో పోటీవారితో యేర్పడిన పోటీ చాలావరకు తగ్గడంవలన మానసికంగా విశ్రాంతి లభిస్తుంది. ఉద్యోగంలో అధికారు లదరాభిమానాలను పొందగలరు.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు శ్రమ మీద నెరవేరుతాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

కన్య: వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో వ్యయ ప్రయాసలకు గురి కాగలరు. కాని తరువాత క్రమంగా అన్నివ్యవహారాల్లోను అభివృద్ధిని సాధించగలరు. వ్యాపారం భారీయెత్తున చేయడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. వృత్తి రీత్యా చేసే

వారఫలం

27-5-1966 శుక్రవారం మొదలు

2-6-1966 గురువారం వరకు.

ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణించగలదు. కుటుంబ సంతోషం లభిస్తుంది.

స్త్రీలకు— స్వల్ప అనారోగ్యం చేయవచ్చును. శుభకార్యాల విషయంలో అనుకూల వార్తలను వింటారు.

తుల : కొన్ని వ్యవహారాలు సులువుగానే నెరవేరినా, మరి కొన్నింటిలో చాలా శ్రమ పొందవలసి వస్తుంది. భారీయెత్తున చేసే వ్యాపారాల్లో కొత్త సమస్యలు తలయెత్తగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది ఆర్థిక వ్యవహారాలు యిదివరకటి కంటె బాగా ఉంటాయి. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో స్వల్ప భేదాభిప్రాయాలు రావచ్చును. బంధువులకు సహాయం చేస్తారు.

వృశ్చికం : వారం ప్రారంభంలో అన్నివ్యవహారాలు అనుకూలంగానే ఉంటాయిగాని వారాంతానికి చికాకులు కలుగుతాయి. నూతన వ్యాపారాల్లో సమయానికి మిత్రుల సహకారం లభించగలదు. రావలసిన డబ్బు మీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. ఉద్యోగంలో వారాంతంలో కార్యభారం పెరుగుతుంది. కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగాఉన్నా, కొంచెం బలహీనత కన్పిస్తుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

ధనుస్సు : గతవారం కంటే యీ వారం బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో యిదివరకు యేర్పడిన అనిశ్చిత పరిస్థితి తొలగిపోవడం వలన ముమ్ముందు లాభించగల వ్యవహారాల్లో తగినంత శ్రద్ధను వహించగలరు. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి రాగలదు. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. రాజకీయ వ్యవహారాల్లో అనుకూల వార్తలను వింటారు.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు కొద్ది మార్పులతో నెరవేరతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం : మీ ఆలోచనలు మీ స్వంత వ్యవహారాల కంటే యితరులకు సలహా రూపంలో బాగా ఉపకరిస్తాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాల్లో నూతనావకాశాలు లభిస్తాయి. వారం ప్రారంభంలో సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు శ్రమ మీద ఫలించగలవు స్థిరాస్థి వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో మీ కృషి రాణించగలదు.


కుంభం : వృత్తి వ్యాపారాల్లో ఆదాయం కంటే ఆదాపుడి అధికంగా ఉంటుంది. ఫలితం చేతికి వచ్చేవరకు యే వ్యవహారాన్నీ నమ్మడానికి అవకాశంలేదు. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదిలి వేయడం మంచిది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం అధికం కాగలదు. ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా, శరీర శ్రమతో కూడిన కార్యక్రమాలు తగవు.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా నెరవేరతాయి. విలాస వస్తువులు కొంటారు.

మీనం : మీరు యిదివరకు యెంతో కృషి చేసి ఒకదారికి తెచ్చిన వ్యవహారాల్లోనే కొత్తసమస్యలు తలయెత్తడం వలన మానసికాందోళన కలుగుతుంది. వ్యాపారంలో పోటీవారితో వాదప్రతివాదాలకు దిగడం మంచిదికాదు. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగంలో యెదుటివారిదే పైచేయి అయినా మీరే సర్దుకొనిపోవలసి వస్తుంది.

స్త్రీలకు —ఆరోగ్యం బాగానే ఉంటుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. బంధుమిత్రులను కలుసుకొంటారు.

—మహేష్ ●



తండ్రిమనసు

కొలను వేంకట దుర్గాప్రసాద్



"ఇంతవరకు చదివిన చదువు చాలు. నువ్వేం చదివి ఉద్యోగాలు చెయ్యక్కర్లా! వూళ్లేలక్కర్లా — ముందా పుస్తకాలు అక్కడ పెట్టు. ఈ చాకిరి అంతా ఎవడు చేస్తాడు నీ మొగుడు?.....నే జెయ్యలే నమ్మా!" కాంతమ్మ పెద్ద పెట్టున అరిచింది.

ఆ అరుపులకు సుజాత భయపడింది. కళ్లు నీళ్లతో నింపుకుంది. శరీరం చెమటపోసింది. వస్తున్న దుఃఖానికి ముక్కు వణికింది. కన్నీళ్లు తుడుచుకుంటూ పుస్తకాలు టేబిల్‌మీద పెట్టేసింది. వాటివంక దీనంగా చూసింది ఒకసారి. బడి, బడిలో పిల్లలూమాష్టారూ మంచి మార్కులూ......అన్నీ ఒక్కసారిగా గుర్తుకొచ్చాయి సుజాతకు. కళ్లు తుడుచుకొని నిలబడిపోయింది.

తండ్రి చంద్రయ్య ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు. కానీ ఏం పలకలేదు. కండువా భుజంమీద వేసుకొని బయటికి నడిచాడు.

అలా మవునంగా వెళ్లిపోతున్న తండ్రి వంక వో క్షణం చూసింది. బాధకి దుఃఖం పెల్లుబికింది. కానీ, పిన్ని— సవతి తల్లి—కనపడగానే దుఃఖాన్ని మింగింది— ఈశ్వరుడు గరళాన్ని మింగినట్టు.

"అలా నుంచున్నావేం మొద్దల్లే? ముందు బట్టలుతుకు—బండెడున్నాయి. నువ్వలా పుస్తకాలు పుచ్చుకొని దొరసానిలా చదవడాని కెళితే నేను ఈ పనులన్నీ ఏలా చేయాలంట? చస్తున్నా ఒక్కదాన్ని. నీకేం వేళకి తినడం తెల్సు— ముందుకదులు!" హుంకరించింది కాంతమ్మ.

సుజాత అలాగే ప్రాణంలేనిదానిలా వినసాగింది కాంతమ్మ అరుపులు. హుంకరించగానే బెదిరి కదిలింది.

మూలనున్న బట్టలకేసి చూసింది. అన్నీ తీసి నీళ్లలో నానేసింది—సబ్బు పెట్టింది.

"ఛీ! వెధవ బ్రతుకు. తిట్టుతినని రోజులేదు తన జీవితంలో. రోజూ అన్ని పనులూ చేసే బడికెళుతున్నా పిన్నికెందుకు తన మీద కోపం? తెల్లవారు జామునే లేచి అన్ని పనులూ ముగించి— పిన్నికి యే ఇబ్బంది కలగకుండా తను బడికెళుతుంది. తన చదువు గురించి పిన్ని ఇంతకాలం అభ్యంతరం చెప్పలేదు. కానీ ఇవాల్టికి ఆ చదువుక్కూడా స్వస్తి చెప్పవలసి వచ్చింది.....ఈపాటికి తను బళ్లో ఉండేది. భవాని వెళ్లేఉంటుంది బడికి. ఇప్పుడు ఎస్సెల్సీ చదువుతోంది. తను కూడా ఎస్సెల్సీలో ఉండేదే! కానీ నాన్న పిన్నిని చేసుకున్న సంవత్సరం బడి మానేయవలసి వచ్చింది. అప్పుడు తన ఆరోగ్యం దెబ్బతింది. లేకపోతే తనూ భవాని క్లాసులో కూర్చుని ఉండేది!"

పదిహేనేళ్ల సుజాత ఆలోచిస్తూనే బట్టలు ఉతక సాగింది. ఆ ఉదయం బాధతో నిండిపోయింది బడి మానేయవలసి వచ్చినందుకు.

'ఇలా బడి మానేయాల్సి వచ్చినదాని బాధ కంటే నాన్న మవునమే తనకు బాధగా వుంది. అమ్మవుంటే ఇలా జరిగేదా?....... అమ్మా?!......'

ఒక్కసారి సుజాత హృదయం 'అమ్మా' అని అరిచింది. ఎక్కడో దీరంగా నిదురిస్తున్న అమ్మకు వినపడలేదు సుజాత పిలుపు.

'అమ్మవుంటే తను ఈనాడు బడి మానేయవలసి వచ్చేదికాదు......ఆరోజు..... తనకి అప్పుడు ఐదేళ్లే అయినా అమ్మ మాటలు ఇంకా జ్ఞాపకం ఉన్నాయి. ఆరోజు అమ్మ తనని ఒళ్లో కూర్చో

బెట్టుకుంది. హృదయానికి హత్తుకుంది అమ్మ చల్లటి హృదయంలో తను ముడుచుకొంది.

"అమ్మాయిని డాక్టర్ చదివిద్దాం. నేనెలాగూ చదువుకోలేదు. దాన్నన్నా చదివిస్తాను......ఏమండీ?......." నవ్వుతున్న నాన్నకేసి చూసింది అమ్మ.

"ఏం బాగా చదువుకుంటావా మరి? రోజూ బడి కెళ్ళాలి. నేను పంతులుగారితో చెప్తాను. ఆయన చాలా మంచివారు. నువ్వు రోజూ పెందరాళేలేచి, శుభ్రంగా స్నానం చేసి బట్టలేసుకొని బడికెళ్ళాలి. అలా నువ్వు రోజూ వెళితే నీకు రేపు కొత్త బట్టలు కుట్టి పెడతా. ఏమ్మా! ఏం వెళతావా?" అమ్మ తనని గడ్డం పుచ్చుకొని అడిగింది. తను తలూపగానే హృదయానికి మళ్ళా హత్తుకుంది.

మరో సంఘటన.

"అమ్మా! నాకు తెలుగులో డెబ్భై మార్కులు వచ్చాయి. మిగతావాటిల్లో కూడా బాగా వచ్చాయి" తను అమ్మతో పరుగెత్తుకుంటూ వెళ్ళి చెప్పింది. అమ్మ ఎత్తుకుంది తనని.

తర్వాత కాస్సేపటికి మాష్టారుకూడా వచ్చారు. "అమ్మాయి ఫస్టుగా చదువుతోందమ్మా. ఈ సంవత్సరం కాగానే హైస్కూల్లో చేర్పిద్దాం. పట్నం పోవలసిన పనిలేదు. ఈ సంవత్సరం హైస్కూలు మొదలు పెడతారు" అన్నారు.

నాన్న నవ్వాడు. అంతా విని తనని ఎత్తుకున్నాడు. తన కళ్ళమీద ముద్దు పెట్టుకున్నాడు. "అలా చదువుకోవాలి మరి" నాన్న కూడా గుండెలకు అదుముకున్నాడు.

కానీ, తర్వాత కొన్ని రోజులకు?

అమ్మకి చిన్న జ్వరం వచ్చింది. మూడో రోజుకు ఎక్కువైపోయింది. అమ్మ మంచంలో ప్రక్కనే కూర్చుంది తను. అమ్మకి ఏదో, బాధగావుంది మనస్సులో.

"అమ్మా!" పిల్చింది తను.

"తల్లీ!" కన్నీళ్ళు పెట్టుకొంది అమ్మ.

"పూరుకో రంగా—పూరుకో, నీకేం భయంలేదు. తగ్గుతుంది" నాన్న బొంగురు కంఠంతోనే అమ్మతో చెప్పాడు.

అమ్మ అదోలా నవ్వింది.

ఆ గదంతా మందు సీసాలతో నిండిపోయింది. అంతా మందువాసన.

మరో రెండురోజులకి అమ్మ చెప్పింది నాన్నతో. అప్పుడు అమ్మ కళ్ళల్లో నిండా నీళ్ళున్నాయి.

"నాకు తెల్సు......నేను బ్రతకను..... ఏమండీ! పాపని బాగా చూసుకుంటారు కదూ? బాగా చదివిస్తారుకదూ?"

అమ్మ కళల్లో నీళ్ళు గబ గబా బయటికి ప్రవహించాయి.

"పూరుకో రంగా! అలా భయపడకు! కాసేపు మాట్లాడకు. నీ ప్రాణానికేం భయంలేదు రంగా!" నాన్న ఎందుకో ఏడ్చాడు.

డాక్టర్ వచ్చాడు. మామూలుగా మందు లిచ్చాడు.

నాన్న డాక్టర్ వంక దీనంగాచూసాడు.

"తెల వారితే ఏ సంగతి చెప్పగల్ను!" డాక్టర్ మాటలు వినపడ్డాయి నాకు.

అమ్మ మత్తుగా నిద్ర పోతోంది—ఇంజక్షన్‌వల .

"డాక్టర్‌గారూ! ఎలాగైనా నా రంగని కాపాడండి! ఈ పాపని తల్లిలేనిదాన్ని చేయకండి. మీ కెంత డబ్బు కావాలన్నా ఇస్తాను.......డాక్టర్‌గారూ!" నాన్న డాక్టర్ చేతులు పట్టుకొన్నాడు. తను అమ్మమంచం దగ్గరేవుండి అంతా చూస్తోంది.

నేను దేవుణ్నికాదు అన్నట్టు డాక్టర్ అదోలా చూసి వెళ్ళిపోయాడు.

ఇంటినిండా బంధువులు. పెళ్ళికొచ్చినంత జనం వచ్చారు.

అమ్మ మొహంమీద ముంగురులు చిరుగాలికి ఎగురుతున్నాయి. అవి ఏవిటో సైగ చేస్తున్నాయి. తెల్లటి దుప్పటి అమ్మ గుండెల వరకు కప్పబడి వుంది.

బాబాయి తనని బయటికి తీసుకొచ్చాడు ఎత్తుకొని. బాబాయి తన మొహంలోకి చూసి గుండెలకు హత్తుకున్నాడు. తన మెడ తడిసింది.

తెల్లవారింది.

తెల్లటి దుప్పటి అమ్మ మొహంవరకు కప్పేసివుంది. నాన్న గుండెలవిసేటట్టు ఏడుస్తున్నాడు. అప్పటికి తను అర్ధం చేసుకొని

కలిగింది. తనూ ఏడ్చింది.

ఆరోజు అంతా ఏడుస్తూనేఉన్నారు.

"ఏవిటీ ఆలోచిస్తున్నావ్? బట్టలకు సబ్బెట్టి, అలా గుడ్డిదానిలా గాల్లోకి చూస్తూ కూర్చున్నావేం?" కాంతమ్మ సుజాత దగ్గరగా వచ్చి అరిచింది.

సుజాత ఆలోచనల మేడ కూలిపోయింది.

*　　*　　*

తర్వాత—

పలువురి బలవంతాన చంద్రయ్య రెండో పెళ్ళి చేసుకోక తప్పలేదు.

చంద్రయ్య జీవితంలోకి కాంతమ్మ ప్రవేశించింది. కానీ రంగరూపంతో నిండిన అతని హృదయం కాంతమ్మ ఎడల ఉదాసీనత చూపించింది.

రోజూ పొలం వెళ్ళేవాడు. పొలం పనులు చూసుకొనేవాడు. సుజాతకు దగ్గరుండి అన్నీ కనుక్కునేవాడు. కాంతమ్మకి కోపం మిన్నంటింది. ఆ ఉదాసీనత భరించలేకపోయింది. కాంతమ్మ తల్లితండ్రులు తమ కూతురి బాధచూసి కుమిలిపోయారు.

వో పండుగరోజున చంద్రయ్యవద్దనుకుంటూనే అత్తవారింటికి వెళ్ళాడు. అక్కడ మూడు రోజులున్నాడు.

కొన్ని రోజులకే చంద్రయ్య మారిపోయాడు. సుజాత బాగోగులు అతను పట్టించుకోడం మానేసాడు. కారణం లేకుండానే తమ్ముడు నారాయణతో ఘర్షణపడ్డాడు.

అన్న పరిస్థితిచూసి నారాయణ ఆశ్చర్యపోయాడు. ఈ వింత మార్పు అతన్ని కృంగదీసింది. సుజాత భవిష్యత్తు ఏమిటి? అనే ప్రశ్న అతనిలో చెలరేగింది.

అన్నతో ఘర్షణపడ్డరోజు నారాయణ ఎంతో బాధపడ్డాడు. ఆరోజురాత్రల్లా నిద్ర పట్టలేదు. 'అన్నయ్య ఎలా మారిపోయాడు' అన్నదే అతని ప్రశ్న.

'మీ పిచ్చిగానీ, బావగారు మారడంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఆయనకు మందు పెట్టారు' పార్వతి అంది.

భార్య మాటలు విని నారాయణ నిశ్చేష్టుడయ్యాడు.

*　　*　　*

తండ్రిమనసు

సుజాత పూర్తిగా బడికి వెళ్ళడం మానేసింది. ఇంటి పని చేయడంతోనే మునిగిపోయింది. ఈ పనులు అన్నీ చేయటానికి ఈ ఇరవై నాలుగు గంటలు చాలవు" అప్పుడప్పుడు అనిపించేది సుజాతకు.

నారాయణ అన్నయ్య ఇంటి ప్రక్కనే ఉంటున్నాడు. మరీ దగ్గరిగా ఉండడంవల్ల సుజాత పరిస్థితి గమనిస్తూనే ఉన్నాడు. పార్వతి కూడా చూస్తుండేది.

"చూడు పార్వతీ! కన్నకూతురుకు చదువు చెప్పించడం మాన్పించి తన బావమరిదికి చదువు చెప్పిస్తున్నాడు. పోనీ వాడైనా చదువుతున్నాడా సవ్యంగా అంటే అదీ లేదు. మొన్నీ మధ్య తెల్సింది వాడికి అన్నీ చెడ్డ అలవాట్లే నట. తాగుతాడట! నలుగురు స్నేహితులతోను కలిసి రూములో పేకాట ఆడ్డం. ఇదీ పట్నంలో ఆయనగారి చదువు. మరి అన్నయ్యకు ఇది తెల్సో తెలియదో కానీ ఆయన మాత్రం నెలనెలా డబ్బు ఎక్కువగానే పంపుతున్నాడు. ఇదంతా ఈ వదినగారి ప్రోత్సాహమే. ఎంతైనా తమ్ముడు కదా!"

పార్వతి వింటూ ఉండిపోయింది.

"నా బాధల్లా ఒక్కటే పార్వతీ! సుజాతను చదువు మాన్పించేయడమే. రంగ వదిన ఏమనేదో తెల్సా? సుజాతను డాక్టర్ దుస్తుల్లో చూడాలని వుంది అనేది. అన్నయ్య సరే అలాగే చదివిస్తాను డాక్టర్ కోర్సు' అనేవాడు. ఆ మాటలన్నీ ఈరోజు ఏమయ్యాయి? రోజూ సుజాతను చూస్తూనే ఉన్నాంకదా! సరైనబట్టలు లేవు. ఆస్తి లేక మాడుతున్నారా? కన్నకూతురికి ఏం కావాలో కూడా అన్నయ్య బొత్తిగా పట్టించుకోడం లేదు. ఇలా ఎంతకాలం? నేను సుజాత బాధ చూళ్లేను పార్వతీ. ఆ తిట్లు, దెబ్బలు, ఛీ ఛీ! ఆవిడ అసలు మనిషేనా? ఏమనాలి." నారాయణ ఆవేశంగా అన్నాడు.

పార్వతి మెల్లగా అంది "ఊరుకోండి! ఆవిడ వినగల్దు. అసలే భరించలేం ఆవిడతో నెయ్యం."

నారాయణ తగ్గాడు.




టినోపాల్‌తో అన్నింటికంటె హెచ్చు తెల్లదనం వస్తుంది

ఆఖరిసారి బట్టలు జాడించడానికి ముందు కాస్త టినోపాల్ వేయండి-పరిచూడండి. మీ తెల్ల బట్టలన్నీ మిరుమిట్లు గొలిపేలా మెరుస్తాయి. షర్టులు, చీరెలు, తువ్వాళ్లు, దుప్పట్లు—ప్రతీదీ అదనపు తెల్లదనం పొందుతుంది.

ఈ అదనపు తెల్లదనం మూలంగా మీకు ఖర్చు ఎంతో? ఒక బట్టకు ఒక పైసా కూడా కాదు. ఒక బాల్చీడు బట్టలను తెలుపు చేయడానికి ఒక పావు చిన్న చెమ్చాడు చాలు.

శాస్త్రీయంగా తయారుచేసిన లైసెర్ టినోపాల్‌నే ఎల్లప్పుడూ ఉపయోగించండి. ఇది బట్టలకు ఏ విధంగానూ చెరుపు (హాని)చేయదు.



ఇప్పుడు సీలుచేసిన అల్యూమినియం ఫాయిల్ పేకెట్‌లో కూడా దొరుకుతుంది.

ఒక పేకెట్‌తో ఒక బాల్చీడు బట్టలు తెలుపు అవుతాయి. ఉపయోగించడం సులభం—ఎటువంటి వృధా లేదు. ఒక బాల్చీకు ఒక పేకెట్ చాలు.

టినోపాల్, జె. ఆర్. గైగి ఎస్. ఎ., బాల్, స్విట్జర్లండ్ వారి రిజిస్టర్డు ట్రేడ్ మార్కు.

సుహృద్ గైగి లి. పి. ఓ. బాక్సు 965, బొంబాయి-1. బి. ఆర్.

Shilpi SG 223A Tel

"ఇకా చిరకాలం లేదండి. సుజాతకు పెళ్ళీడు వచ్చింది. ఏదన్నా సంబంధం చూస్తే సరి. ఈ నరకం నుంచి తప్పుతుంటుంది." పార్వతి మెల్లగా అంది.

నారాయణ ఆలోచించాడు.

'అవును' అన్నాడు మెల్లగా.

సుజాతకు మంచి సంబంధం చూడాలని నారాయణ అన్వేషిస్తున్నట్టు కాంతమ్మకు తెలియగానే అంతెత్తు లేచిపోయింది చంద్రయ్య మీద.

"పెళ్ళి సంబంధం చూడ్డానికి ఈయనెవరంట? ఇక్కడ అంతా చచ్చారనుకున్నాడా ఆయన? దానికేం పెళ్ళి ప్రయత్నాలు చేయక్కర్లేదు. నా తమ్ముడున్నాడు. రాజాలాంటి సంబంధం. ఇంకా పరాయి సంబంధం దేనికి?—కట్నాలు దండుగ." మనస్సులో కోర్కెను బయట పెట్టింది కాంతమ్మ.

చంద్రయ్య విన్నాడు. కానీ మౌనంగా ఉన్నాడు మామూలుగానే.

ఈ విషయం సుజాత గుండెల్లో రాయి పడ్డట్టయింది.

సుబ్బారావు మామయ్యతో తనకు పెళ్ళా?

మామయ్య ఎటువంటివాడో నాన్నకి తెలీకపోయినా తనకు తెలీదూ? తాగుతాడు. ఆరోజున తాగే కదూ ఇంటికి వచ్చాడు. పైగా మామయ్య చదివేది ఏమిటో బాబాయి అంతా చెప్పాడు.

ఆ మామయ్యతోనేనా తనకు పెళ్ళి?

అమ్మ చనిపోయినప్పుడు ఎంత ఏడ్చిందో, అంత ఏడ్చింది సుజాత.

కాంతమ్మ లేని సమయంలో సుజాత బాబాయి ఇంటికి వెళ్ళింది.

"పిన్నీ!" బావురుమంది సుజాత పార్వతి ఒళ్ళో తల దాచుకుంటూ. పార్వతి కళ్ళు చెమర్చాయి.

"ఊరుకో సుజాతా! బాబాయితో నేను చెబుతాను. ఆయనుండగా నీకేం భయం లేదు. విన్నలా ఆ తాగుబోతుకి కట్టబెడుతుంటే మేం చూస్తూ వూరుకుంటామా నీకేం భయంలేదు."

సుజాతని ఓదార్చింది పార్వతి. తనకూ తెల్సు ఏమీ చెయ్యలేమని. కానీ సుజాతకు ధైర్యం చెప్పడానికోసం అలా అనక తప్పలేదు పార్వతికి.

ఆరాత్రి నారాయణకు ఇదంతా చెప్పింది. నారాయణకు ఏం చెయ్యాలో తోచలేదు. మౌనంగా ఉండిపోయాడు.

"ఏవండోయ్ మా తమ్ముడ్కి పరీక్షలు అయిపోయిన వెంటనే బయలుదేరి రమ్మని రాయండి. వాడి దగ్గర రావడానికి దారి ఖర్చులుండకపోవచ్చు. నోవంద మనీయార్డరు చేయండి."

"ఎందుకు?" చంద్రయ్య అడిగాడు.

"అయ్యో!. ఎందుకేమిటండీ? ముహూర్తాలు దగ్గర కొచ్చేస్తున్నాయి. మంచి రోజు చూసి రమ్మని మానాన్న రాశారు. పెళ్ళి విషయం మాట్లాడ్డానికే. అందుకే ఇవాళ బయలుదేరా." అంది కాంతమ్మ చంద్రయ్యను సూటిగా చూస్తూ...

"ఏవిటి పలకరేం?" అంది.

"ఇవాళే వెళుతున్నావా?"

"అవును. ఏం?"

"ఏంలేదు—సరె వెళ్ళు." చంద్రయ్య అక్కడ్నించి లేచి వెళ్ళిపోయాడు.

కాంతమ్మ ప్రయాణానికి సన్నదురాలయింది. చంద్రయ్య కాంతమ్మని తీసుకొని స్టేషన్‌కి వెళ్ళాడు.

సుజాత గబగబా గదిలోకి పారిపోయింది. చీకటైనా లైటు వేయలేదు. అలా ఏడుస్తూ వుండిపోయింది.

*　　*　　*

"ఆవిడ వూరెళ్ళింది" పార్వతి అంది భోజానికి కూర్చున్న నారాయణతో.

"దేనికి?" అడిగాడు.

"సుజాత పెళ్ళి గురించే. బహుశా ముహూర్తం ఏర్పాట్లు గురించే ననుకుంటాను." అంది.

నారాయణకి భోజనం సహించలేదు. మధ్యలో లేచి[illegible]యాడు. [illegible]ర్వతి బాధ పడింది.

నారాయణ వరండాలోకి వచ్చి ఆలోచించసాగాడు. 'తనకూ అన్నయ్యకూ మాటలు పోయి రెండేళ్ళు అవుతోంది. ఇప్పుడు సుజాత గురించి మాట్లాడితే ఆయన ఒప్పుకోడు. అసలే పట్టుదల మనిషి. ఇప్పుడీ విషయం ఆయనతో ప్రస్తావించడం వలన లాభం కనిపించదు. బహుశా తను కనిపించగానే ఆయన లేచిపోవచ్చు. తనతో మాట్లాడ్డానికి ఆయనకు బొత్తిగా ఇష్టంలేదు.

ఈ పెళ్ళి విషయం ఆయనతో ప్రస్తావించడం ఒకవిధంగా సుజాతకు అన్యాయం చేసినట్టు అవుతుంది. ఆయన పట్టుదలగా తన బావమరిదికి ఇచ్చి చెసేయొచ్చు. కానీ ఈ విషయం పరిష్కరించే మార్గం ఏవిటి? ఈ పెళ్ళి ఎలా ఆగుతుంది?

నారాయణ బుర్ర వేడెక్కిపోయింది.

పార్వతి నారాయణ పరిస్థితి గమనించింది.

నారాయణ భార్య వంక చూసాడు.

"పార్వతీ! ఈ పెళ్ళి విషయం మీ బావగారితో మాట్లాడగలవా?" అన్నాడు హఠాత్తుగా.

"బావగారితోనా? నేనా?" ఆశ్చర్యంతో అంది.

"అవును పార్వతి! నువ్వే వెళ్ళాలి. నేను వెళితే, మా మధ్య మాటలు కుదరవు. ఆయన పట్టుదల మనిషి. నీకు తెల్సుగా. ఈవిడ ఎలాగూ వూరు వెళ్ళింది. ఈవిడ వచ్చేలోపులో మనం సుజాత పెళ్ళి ప్రయత్నం ఆగేట్టు చేయాలి." అన్నాడు.

సుజాత అన్నం పెట్టింది తండ్రికి. తిని లేచాడు. సుజాత అన్ని కడిగి తన గదిలోకి వెళ్ళింది. లైటు ఆర్పేసింది. చంద్రయ్య దొడ్లో మంచం వాల్చుకున్నాడు. వెల్లకిలా పడుకొని ఆకాశం వంక చూస్తూ వుండిపోయాడు.

అడుగుల చప్పుడయింది.

"సుజాతా!" అన్నాడు చంద్రయ్య. కూతుర్ని అంత లాలిత్యంగా పిలవడం చూసి తనకు తానే ఆశ్చర్యపడ్డాడు చంద్రయ్య.

"నేను బావగారూ?" అంది పార్వతి.

చంద్రయ్య గభాల్న మంచమీంచి లేచి కూర్చున్నాడు. ఎదురుగా దూరంగా పార్వతి నుంచొనుంది.

"నువ్వా పార్వతీ!" అన్నాడు. అతని గొంతుక అదోలా ధ్వనించింది.

పార్వతి మాట్లాడలేదు. ఎలా మొదటు పెట్టాలో తెలియలేదు. చాలాసేపు మౌనంగా ఉండిపోయింది.

చంద్రయ్య గమనించాడు.

"సుజాత పెళ్లి గురించేనా?" అడిగాడు చంద్రయ్య.

పార్వతి ఆశ్చర్యపోలేదు.

"నాకు తెల్సు పార్వతీ. నారాయణకి ఈ పెళ్లి ఇష్టం లేదని తెల్సు. వాడి బాధ నాకు తెల్సు. కానీ నాతో మాట్లాడడు. వాడికున్న పట్టుదల నాకేవా లేంది?" చంద్రయ్య గొంతులో బాధ ధ్వనించింది.

"ఇంకో విషయం - పార్వతీ! సుజాతకు ఈ పెళ్లి జరగదు." అన్నాడు.

పార్వతికి ఆశ్చర్యంతో మాట రాలేదు.

"సుబ్బారావు ఎలాంటి వాడో మొన్న వెళ్లినపుడు కనిపెట్టాను. ఒట్టి తాగుబోతు వెధవగా మారాడు. మత్తులో నన్నే గమ

తండ్రి మనసు

నించలేదు. అటువంటి వాడికి నా కూతుర్ని ఇవ్వనా? అది జరగదు. సుజాతకి బంగారం లాంటి సంబంధం చేస్తాను. ఈ కాస్త ఆస్తి వాడి చదువు కోసం తగలేశాను. ఇక నైనా కళ్ళు తెరిచాను. లేకపోతే నా సుజాత గతి ఏమయ్యుండేదో?" చంద్రయ్య కళ్ళలో నీళ్ళు కన్పించాయి పార్వతికి.

* * *

మూడోనాడు కాంతమ్మ దిగింది పూల్లోకి.

"అమ్మయ్య! ముహూర్తం నిర్ణయించడం అయింది. వాడికి రమ్మని రాసారా? ఇవాలే రాయండి...మామాన్నగారు కట్నం పదివేలు మాత్రమే అడిగారు. సరే అనక తప్పిందిగాదు. అన్నట్టు సునియార్డరు పంపించారా?" అడిగింది కాంతమ్మ.

"లేదు."

"అయ్యో! సరేలెండి. ముందు ఉత్తరం రాయండి రమ్మని" బలవంతం చేసింది కాంతమ్మ కాయితం కలం చంద్రయ్యదగ్గరుంచింది.

"నాకే కనక చదువొచ్చుంటే నేనే రాసేదాన్ని. ఈపాటికి" నవ్వింది కాంతమ్మ.

చంద్రయ్య కాయితం మీద ఇలా మొదలెట్టాడు.

"సుబ్బారావుకి!

ఇంతకాలం నేను పన్నీటిని బూడిదలో పోస్తున్నానని తెల్సింది. నీ కోసం ఎంతో ఖర్చు చేశాను. కానీ నీ ప్రవర్తన ఈనాటికి తెల్సింది. ఇకనుంచి ఒకప్పైన కూడా నువ్వు నా దగ్గర్నుంచి ఎదురు చూడకు.

సుజాతతో నీకు పెళ్ళి కల్ల."

సంతకం పెట్టి ఉత్తరం మడిచాడు.

"ఏది చదవండి!" కాంతమ్మ అంది.

చంద్రయ్య మడత విప్పాడు మళ్ళా.

"వద్దులెండి. మరీ ఆలస్యం అవుతుంది ఇలా తెండి." అని ఉత్తరాన్ని లాక్కుంది. కాంతమ్మ. తనే మడిచి కవర్లో పెట్టింది.

పాలేరును కేకవేసి పిల్చి ఆ కవర్ని ఇచ్చి "త్వరగా పోస్టు చేసిరా!...త్వరగా" నొక్కి చెప్పింది కాంతమ్మ. అవిడిచ్చిన పావలా కాసు కూడా ఆనందంగా అందుకున్నాడు ఆ పాలేరు. ●

స్త్రీలు - పార్ట్ టైమ్ ఉద్యోగాలు

శ్రీమతి కోమలాదేవి

స్త్రీలు ఉద్యోగం చేయవచ్చునా? ఉద్యోగాల్లో ప్రవేశిస్తే కల్గే లాభ నష్టాలు, సాధక బాధకాలు — చర్చించడం కోసం ఈవ్యాస రచన ఉద్దేశింప బడలేదు.

స్త్రీలకు—కొన్ని తరగతులవారికి ఎలాంటి ఉద్యోగాలు సబబైనవి? — అన్నదే ప్రశ్న.

ఆర్థిక వత్తిడి వల్లనైతేనేమి, ఉన్నత విద్యనభ్యసించి ఇంట్లో గోళ్లు గిల్లుకుంటూ కూచోలేక అనుకుంటే, వీరికి ఎలాంటి ఉద్యోగాలు సరైనవి?

ఈకాలంలో ఇంట్లోవుండి ఒకరి సంతానాన్ని చూచుకునే ఓపికగల బంధువులు ఎవ్వరులేరు. ఉన్నా సరిగా చూచుకోరు. నౌకర్లపై ఆధారపడలేము. గృహిణి ఉద్యోగానంతరం అలసి గృహంచేరుకుంటే బోలెడన్నిసమస్యలు ఆమెను చుట్టుముడ్తాయి. నగరాల్లో ప్రొద్దున్న తొమ్మిదిగంటలకు ఇల్లువదిలితే సాయంత్రంఆరుగంటలకు గాని ఇల్లు చేరలేదు. చంటిపిల్లలున్నవారు ఉద్యోగాలు తప్పనిసరిగా చేయవలసివస్తే—ఎంతోచికాకుతో, అలసటతో, ఇల్లుచేరటం—పనులన్నీ అసంపూర్ణంగా చేసికోటం — కోపంతోపిల్లల్ని కసురుకోటం—చివరకు భార్యాభర్తలు మాటామాటా అనుకోటం—దాంతో అశాంతి, నిస్పృహ— సమస్యలనెదుర్కొనే శక్తిలేక జీవితాన్ని దుర్భరం చేసికొంటారు!

ఒకస్త్రీ, లేకగృహిణి ఉద్యోగంచేయవలసి వస్తే పార్ట్‌టైమ్‌ఉద్యోగాలుసరైనవి. ఎడ్యుకేషన్ కమిషన్‌వారు గృహిణులకు, కొన్ని పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేయటానికి తర్ఫీదు నివ్వటానికి ఆలోచిస్తున్నారట!

పిల్లలు ఒక వయసు దాటినతర్వాత బడులకు వెళ్లిన అనంతరం తల్లికి బాధ్యతలు కొన్ని తగ్గుతాయి. చేతినిండా కాక పోయినా, కొన్నిగంటల తీరికసమయం లభిస్తుంది. ఇరవైనాల్గు గంటలు ఆమె ఇంటిపట్టున ఉండనవసరంలేదు. ఈ తీరిక సమయాన్ని వ్యర్థంచేయకుండా, సద్వినియోగం చేస్తూ ఇలాంటికొన్ని గంటల ఉద్యోగంలో ప్రవేశిస్తే ఇటు కుటుంబం ఆర్థికవత్తిడిలేక సాఫీగానడుస్తుంది— అటు తనవిద్య వ్యర్థంకాలేదన్న తృప్తి వుంటుంది.

ఇలాంటి పద్ధతులు—ఉద్యోగాలు ఎక్కడైన ఉన్నాయా? అంటే విదేశాల్లో ఉన్నాయి. అమెరికాలో ఇలాంటి ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు చాల శ్రద్ధగా, నమ్మకంగా, చురుకుగ పని చేస్తారని తెలిసికొన్నారు! ఇలాంటివారు ఉద్యోగం అంత సులభంగా వదులుకోరు. వేడి నీళ్లకు చన్నీళ్లలా......సాయపడుతుందని దానికితగ్గ వేతనం తీసికోవటంతో సంతృప్తి చెందుతారు.

అదే మనకుమాత్రం ఎందుకు వర్తించదు?

సరే—అంతా బాగుంది. కానీ—ఇలాంటి ఉద్యోగాలెక్కడున్నాయి? ఎవరిస్తారు?


ఈ ప్రశ్నలకు జవాబులు మన మహిళా సంస్థలు, సంఘాలు, పాఠశాలలు, ఆరోగ్య శాఖవారు ఇవ్వాలి. వారే చర్య తీసికొని ముందంజ వేయాలి.

ఇలాంటి ఉద్యోగాలకు ఎలాంటి (అందం విషయంలో కాదుసుమా!) స్త్రీలను తీసికోవాలి? ఏమి చదివి ఉండాలి? అన్నది వాళ్ల ప్రశ్న. ఈ చదువుతో ఇంతమంది చిన్న పిల్లలో. ఏ ఉద్యోగం నాకు సరిపడుతుంది అన్నది స్త్రీ ప్రశ్న.


పిల్లల వయస్సు, ఆమెకుండే తీరిక సమయం, అది ప్రొద్దుటా, సాయంత్రమా లేక సెలవు దినాల్లోనా? అంతా ఆలోచించి తగిన ఉద్యోగం ఎన్నుకునే బాధ్యత ఆమెది.

విద్యావంతులైన స్త్రీ లనేకులు తమ కాలాన్ని తప్పని సరిగా వృధా చేస్తున్నారు. అది వారి తప్పుకాదు. వీరి "శక్తి" ని దేశం ఉపయోగించుకుంటే దేశం బాగుపడుతుంది. ఆర్థిక బాధలు తగ్గుతాయి. ఆమె కుటుంబ పోషణకు సాయపడినదౌతుంది. విద్యాశాఖ, ఆరోగ్యశాఖవారు ఇలాంటి పనులను కల్పిస్తే—దానికి తగిన వేతనం నిర్ణయిస్తే మధ్య తరగతికుటుంబ ఆర్థిక పరిస్థితులు చక్కబడి గృహస్థ జీవితం బాగుపడగలదు.

ఇలాంటి పార్ట్ టైమ్ ఉద్యోగం సలక్షణంగా చేసికొని, సంసారాన్ని దిద్దుకొని భర్తకు తోడ్పడేకంటే స్త్రీ కోరేదేమీ లేదనుకుంటాను. ●



క్లిష్ట పరిస్థితి తొలగింది





బాధ అనేది మాకు ఒక సమస్య...చూడండి మేము మీకు ఏవిధంగా సహాయపడతామో!

పరిశోధన: 'ఆస్ప్రో' యొక్క పరిశోధనా సంస్థలోని ఒక పరిశోధనా దళానికి నేను ఉపదేశకుడను. బాధను ఆపుజేయడానికి మంచి మంచి పద్ధతులను కనిపెట్టుట మా పని. ఈ విషయము గురించి ఏకాగ్రతతో ప్రపంచమంతటా పరిశోధనలు జరుపుతున్న అగ్రగణ్యమైన పరిశోధనా సంస్థలలో మేము ఒకరము నొప్పిని నివారించుటకు నేడు క్రొత్త మార్గము 'ఆస్ప్రో' ఫార్ములా అని మేము తెలుసుకొన్నాము. అందుచేతనె ప్రపంచమంతటా డాక్టర్లచేతను, ఆసుపత్రులలోను ఇది వాడబడుతోంది.

బాధ అంటే ఏమిటి? మెటాబొలిక్ ఉత్పత్తులు, దేహము వాటిని తీసుకొని పోగలిగే కంటేహెచ్చు వేగములో, స్నాయువులలో కూడుకొనిచేరి పోవడం వల్ల మరుగుపడిన వాపు కలుగుతుంది. దానితో నరములకు ఒత్తిడి కలిగి బాధ కలుగుతుంది.

'ఆస్ప్రో' ఎలా పనిచేస్తుంది · 'ఆస్ప్రో' దేహములో వెంటనేయిమిడి, వాపును, నరముల మీద వత్తిడిని తగ్గించి నొప్పిని వెడలగొడుతుంది.

'ఆస్ప్రో'ను ఈ వ్యాధులకు వాడండి: నొప్పి • తలనొప్పి • ఒంటినొప్పి • పంటినొప్పి • కీళ్ల నొప్పి • జ్వరముతో కూడిన జలుబు • ఫ్లూ కీళ్ల నొప్పులతో గూడిన జ్వరము.

మోతాదు:
పెద్దవారికి రెండు బిళ్లలు అవసరమైతే తిరిగి వేసుకోనండి పిల్లలకు: ఒక బిళ్ల లేక మీ డాక్టరు సలహా ప్రకారము వాడండి.

A.G.25.66 TEL



'ఆస్ప్రో' నొప్పిని వెడలగొడుతుంది!

చెల్లాయికి ప్రేమతో... 10

'పి. ఎస్.'

చెల్లీ,

చెల్లీ,

నీదగ్గరనుంచి ఈమధ్య బొత్తిగా ఉత్తరమే లేదు. కారణం తెలీదు. నీ అశ్రద్ధే కారణం అయితే ఫరవాలేదు.

నీరజ తెలుసుకదూ నీకు! మనఇంటికి ఫర్లాంగుదూరంలో పెంకుటిల్లు వుండేది. వాళ్ళపెద్దమ్మాయి. ఎర్రగా, పొడుగ్గా నాజూగ్గా కాశీరత్నం పువ్వులా వుండేది. ఆఅమ్మాయికి ఇంకా వివాహంకాలేదు. అని వాళ్ళమ్మలు దిగుపడి, దిగులుపడి ఈమధ్యనే తనువు చాలించింది. ఆవిడ పోయాక ఇంటి పనంతా నీరజ మీదే పడింది. మన వయస్సేకదా తనదికూడా. తనవయస్సును మించి పదేళ్ళు పెరిగినట్లు కనపడుతోందిప్పుడు. ఎప్పుడైనా కనపడితే చాలా నిరుత్సాహంగా మాట్లాడుతుంది. "నాకంత అదృష్టంకూడానా?" "నా బ్రతుక్కి సినిమానా? అయ్యో, రామ" ఇలా మాట్లాడతూంటుంది. ఆ అమ్మాయి ఓర్పుగా ఇంటి పనంతా చేస్తుంది. ఆత్మవిశ్వాసం లేదు. తనను తానే కించపరచుకోడం అలవాటు. దిగుళ్ళవలన బాధలవలన అలా తయారైంది ఆమె. పోనీ నీరజ ఇలామాట్లాడితే కొంతసహించవచ్చు. అన్నీ అమిరి జీవితం వడ్డించిన విస్తరిలా వుండే వాళ్ళు కూడా కొందరు అలా అంటూ వుండడం విన్నాను. ఆత్మవిశ్వాసం లేకపోతే నిరుత్సాహం, నీళ్ళుగారిపోవడం కాకమరేముంది? అలాగే తనను తాను కించపరచుకోడం మంచిది కాదు. నీరజ విషయం కొంచెం సేపు మరిచిపోదాం. బాధలు, కష్టాలు వచ్చినపుడు, చాలా మంది ఇలాగే నిస్పహోయంగా మాటాడుతూ, తమవలన ఏమీ లాభం సమకూరదని, తమ బ్రతుకు ఒట్టి దండగ అనీ అంటారు.

ఈసృష్టిలో ఎవరి బ్రతుక్కీ తగ్గ ప్రయోజనం వారికీవుంది. ఏప్రాణి తక్కువ కాదు. ఎవరివలన ఏప్రయోజనం సమకూరుతుందో అదే సమకూరుతుంది. ఇంతమాత్రాన ఎవరిని వారు న్యూనత చేసుకోవడం దేనికి? నీరజవలన తన ఇంట్లో వాళ్ళంతా సుఖపడుతున్నారు, తన వల్లనే వారికి పనులన్నీవేళకు జరుగుతున్నాయని తెలిసీ నీరజకెందుకాబాధ? ఆత్మగౌరవం లేదన్నమాట తనకి. తమని తాము గౌరవించుకుంటూ ఎదుటి వారిని గౌరవించగలగడమే ఉత్తమలక్షణం....... "మనమేమి చెయ్యలేము. అంతా దైవ నిర్ణయం—భగవంతుడు ఎలా వ్రాసి పెట్టాడో అలాజరుగుతుంది." అంటారు ఇంకాకొందరు. తాము చేసినకృషి ఏదైనా ఫలించకపోతే వస్తుంది ఈనిర్ణయం.

అంతాదైవనిర్ణయం అంటూనే, మనం అన్ని పనులూ చేస్తూనే వుంటాము. మనప్రయత్నాలన్నీ జరిగిపోతూ వుంటాయి. అలా అంటూనే ఈప్రయత్నాలెందుకు! ఏదో ఆశవలన. ఈనిర్ణయంఆత్మవిశ్వాసం లోపించినందు వలన............ఆత్మవిశ్వాసంలేనిదే ఏమీ జరుగదు. "మనంసాధించాలి"అనే పట్టుదల వున్ననాడు సాధించలేనిదేమీ వుండదు. సాధన వలన పనులు సమకూరుతాయని చిన్నప్పుడే చదువుకున్నాం. ఓర్పు, పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం కలవారికి అందనిదీ, వారు అందుకో లేనిదీ ఏమీ లేదు. దైవ నిర్ణయాలు మారవనీ, మారుతాయనీ వాదిస్తూ కూర్చుని నీరసాన్ని గ్లాసుల కొద్దీ సేవించేవాళ్ళని చూస్తే మనకి చాలా చికాగ్గా అనిపిస్తుంది. నీరజకి వివాహంకాలేదు. నిజమే. తనుచదువు కొసడానికి అనేక అవకాశాలున్నాయి. "చదువుకోరాదా?" అని ఎవరైనా అంటే "ఇంకా నాకేం చదువు" అంటుంది ముసలమ్మలా. అందుకే నీరజకి నిస్పృహ.


కష్టాలనేవి అందరికీ సంప్రాప్తిస్తూనే ఉంటాయి. మన ధైర్య స్థైర్యాలకు అవి పరీక్షలు. ఆపరీక్షలలో నెగ్గడానికి కావలసింది ఆత్మవిశ్వాసమేగాని మరొకటి కాదు. అనేక రకాల బాధలతో అల్లాడుతూ, రోజులు గడవడం ఎంతోకష్టంగా వున్నవాళ్ళు అనేక మంది వుండగా తిండికీ బట్టకూ లోటులేక, ఏదోవిధంగా పైకి రావడానికి అనేక అవకాశాలున్న వారే నిస్పృహ ప్రకటించడం హాస్యాస్పదంకాదా? కూలిపనిచేసి ఎంతో పైకివచ్చి పెద్ద పదవులను చేపట్టిన వారిచరిత్రలు చదివాం. అనేక కష్టనష్టాలకు బాధలకు ఓర్చి మనకి స్వాతంత్ర్యం సముపార్జించి యిచ్చిన దేశనాయకుల చరిత్రలూ చదివాం. వీటి నుంచి మనం నేర్చుకున్న దేమిటి. వీరంతావీ సాధనం ద్వారా తాముతలచినది సాధించగలిగారు? అదే పట్టుదల, ఓర్పు, ఆత్మవిశ్వాసం. ఆత్మవిశ్వాసంలేని నాడు మన ఉనికికి సార్థకత లేదు. మన మనుగడకి ప్రత్యేకతలేదు. మందతోపాటు బిక్కుబిక్కుమంటూ వెనక వెనక తిరుగుతూ కాలక్షేపం చేయడం అందరిలాగేమరణించడం. అందువలన ఏమిటి లాభం. అందరిలాగాకాక ప్రత్యేకంగా ఎలామరణిస్తారని నవ్వుతున్నావుకదూ? మరణించడంలో కాక జీవించడంలో ప్రత్యేకత వుండాలి. బ్రతికినన్నాళ్ళూ, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో, ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా, హుందాగా బ్రతకడం నేర్చుకుని మన ఉనికిని సార్థకం చేసుకోవాలి. ఏమంటావ్. అవునంటావని తెలుసు.

వుంటాను.

పి

[సమాప్తం]

ముద్దమందార



భూపతి

3

రోజులు మరీ హాయిగా దొర్లిపోతున్నాయి. ఓ నెల గడిచింది. సింహాచలం నా దగ్గర బాగా చదువు నేర్చుకుంది. యాసగా మాట్లాడుతుండడం కూడా చాలావరకూ మాన్పించాను. శుచీ శుభ్రం దాని దగ్గరే నేర్చుకోవాల్సి వచ్చినందువల్ల అది దానికి నేర్పనవసరం లేకపోయింది. నాతో చాలా కులాసాగా, చనువుగా మెసిలేది.

ఆరోజు ఆదివారం.

తీరుబడిగా పడక కుర్చీలో పడుకుని నా అసమర్థతను, పిరికితనాన్ని విమర్శించుకోడం ప్రారంభించాను. ఆత్మవిమర్శన మంచి దన్నాడు ఓ జ్ఞాని. నా మనోగతాన్ని తెలియజేయలేక పోవడంవల్ల జరిగిన అనర్థాన్ని వూహించుకుంటున్నాను. ఇంతలో గాజుల శబ్దం చేసుకుంటూ సింహాచలం వచ్చింది. ఆమె పచ్చచీర కట్టింది. ఎరుపుమీద తెల్లటి మచ్చలున్న రవిక తొడిగింది. తలలో రెండు ముద్ద మందార పువ్వులు పెట్టుకుంది. చెవులకు కొత్త గా జూకీలు పెట్టుకుంది. తలంటి పోసుకుందేమో జుట్టు స్వేచ్ఛగా ముఖంమీద పడుతోంది. అది చీర కట్టడం అదే మొదటిసారి అనుకుంటాను. "ఏమిటి విశేషం" అన్నాను మనస్సుని అదుపులోకి తెచ్చుకుంటూ.

"ఈవేళ నే పుట్టా" అంది పట్టి పట్టి.

"వోహో ! వెరీ గుడ్! నీ పుట్టిన రోజుకి మరి నాకేం పిండివంటలు వట్రా లేదేం" అన్నాను. సింహాచలం ముచ్చటగా నవ్వి "మా ఇంట్లో చేసినవి మీలాటో .... మీలాటివాళ్లు తింటారే.. తింటారేవిటి" అని తన భాషను సవరించుకుంటూ చెప్పింది.

"నువ్వు పెడితే తిననా" అన్నాను.

అంతే, సింహాచలం చెంగున వెనక్కి పరుగెట్టుకెళ్లి నాలుగు వేరుశనగ ఉండలు పట్టుకొచ్చింది. అవి నా టేబిలుమీద పెడుతూ "మిగతావన్నీ మీరు తినడానికి బాగో .... బాగుండవు" అంది.

"ఇలా తే"అంటూ చె జాపాను. ఆ వుండ చేతిలో పెట్టింది "అయితే మనిద రికి మంచి కాఫీ పెట్టు. నే నింతలో స్నానం చేసొ స్తా." అన్నాను. సింహాచలం తలూపి వెళ్లిపోయింది. నేను ఆ వుండలు తిని చెంబుడు మంచినీళ్లు త్రాగి వీధి తలుపు వేసి స్నానానికి వెళ్లిపోయాను.

స్నానంచేసి బట్టలు మార్చుకునేసరికి సింహాచలం కాఫి పట్టుకువచ్చి "కాఫి రెడీ" అంటూ టేబులుమీద పెట్టింది. కుర్చీలో కూర్చుని కాఫి త్రాగాను. ఇంతలో ఓ వూహ తట్టింది. లేచి అలమరలో ఉన్న కెమెరాను తీశాను. నప్పాలులో కొంతభాగం దె వికంగా మిగిలి ఉంది. ఇంతలో సింహాచలం పని పూర్తి చేసుకుని, ఓ గడ్డిపరక నోటో పెట్టుకుని వచ్చింది. వస్తూనే "అదేటి బాబూ ఆ డబ్బా ఏవిటి" అంది. అంతలో దీన్ని గురుపట్టి, "ఫోటో డబ్బా కదూ" అంది

"అవును" అన్నాను.

"నాకోటి తీరా" అంది.

"అయితే సరిగా నుంచో. లే ... ఆ గడ్డిపరక నోటోంచి తీసి పారేయ్. సరిగా నిలబడు" అన్నాను. సింహాచలం ఫక్కున నవ్వుతూ, "ఏం? ఇదుంటే బొమ్మ రాదా.... నే నిది ఉంటేనే నించుంటా" అంది గడ్డిపరక తిరిగి నోట్లోనే పెట్టుకుంటూ. "సరేలే, అలానే నుంచో" అంటూ మూడు ఫోటోలు తీశాను. కెమేరా దాచబోతుంటే, "ఏదీ నా బొమ్మ" అంది.

"ఇందులో ఉంది." అన్నాను.

"ఏదీ చూపెట్టండి" అంది దగ్గరకు వస్తూ.

"లోపలుంటుంది" అన్నాను.

"ఏదేది?" అంది ఆత్రంతో. నేను తటాలున కెమేరా ఉన్న చేతిని వెనక్కి పెట్టేసుకున్నాను. ఆ వూపులో సింహాచలం నామీద పడిపోయింది. నా శరీరం జివ్వుమంది.

ఆపాదమస్తకం విద్యుత్తు ప్రవహించింది.

నేను నిగ్రహం కోల్పోయాను.

కెమేరా మంచంమీద పడిపోయింది.

ఆమె పెనుగులాడింది.

నాలో చైతన్యం కలిగేసరికి సింహాచలం రుద్రకాళి అయింది. పెనుగులాడి దూరంగా తొలగిపోయింది.

నా స్థితి అర్థమయ్యింది.

సింహాచలం కేసి చూశాను. ముఖంమీద పడ్డ జుట్టు సరిచేసుకుని, విడిపోయిన కొప్పు తిరిగి చుట్టుకుంది. "ఆయ్! వంటరిగా ఆడదానిమీదడతావా! మా జాతోళ్లతో సెప్పి నీతోలొలిపిసా నాగేస్. కీలుకీ లూడదీయిసా" అంది ఆయాసంతో.

నా గుండె లవిసిపోయాయి.

సింహాచలం శపథంచేసి వెళ్లిపోయింది. భయంతో నా ప్రాణం గిలగిల్లాడిపోయింది. శరీరం నీరు కారిపోయింది. కాళ్లు, వళ్లూ వణకడం ప్రారంభించాయి. మంచంమీద కూలబడ్డాను.

తిరిగి లేచి తలుపు గడియవేసి, మళ్లీ మంచంమీద కూర్చునాను. సింహాచలం వాళ్ల జాతివాళ్లకు చెప్తే!

వాళ్లు నా ఎముకలు ఏరేస్తారు.

ఆ వూహతోనే నా ప్రాణం పోయినట్టనిపించింది. నా తొందరపాటుకు, నిగ్రహశక్తి లేకపోడానికీ అలాటి శిక్ష పడాల్సిందే అనిపించింది.

నా మనస్సు ఎదురు తిరిగింది.

ఎందుకు పడాల్సింది? నే నింతవరకూ ఎలాంటి చెడ్డపనీ చేయలేదు. మనస్సులో వెయ్యి వూహించుకుంటాను. ఆ మాట వస్తే ప్రతి మనిషి మనస్సులో వూహించుకుంటాడు. నేనూ అంతే—ఇది లోకన్యాయం. యువ్వనమే అలాటిది. కన్నెపడుచు కిలకిల్లాడుతూ మాట్లాడితే ఏ మగాడయినా నాలా ప్రవర్తించాల్సిందే— అవును— తప్పు కాదు కానేకాదు. అంతవరకు పరిస్థితి వస్తే ఎవడూ నిగ్రహించుకోలేడు.

నాకు ధైర్యం వచ్చింది.

కానీ ధైర్యంతో అప్పుడు పనేమిటి? అవతల ఇంకో క్షణంలో సింహాచలం పెద్ద పటాలంతో వచ్చేస్తుంది. వాళ్లు నా ఎముకలు విరగదీస్తారు. ఎలాగ యీ ఆపద నుంచి బయటపడేది? మంచంమీంచి లేచి పెరటి తలుపు గడియవేసి వచ్చి కుర్చీలో కూర్చున్నాను.

కాలం ఎంతసేపు గడిచిందో.

ఉన్నట్టుండి తలుపులు కటకటలాడింది.

నా శరీరం భయంతో భగ్గుమంది.

శబ్దం మరింత ఎక్కువయ్యింది.

యాంత్రికంగా కుర్చీలోంచి లేచాను నెమ్మదిగా తలుపుతీసి, ఎదుట వచ్చినవాడిని ముక్కు పగులగొడ్తేనో.... ఎంతమందినని కొట్టగలను? ఒక్కసారి నా శరీరంకేసి చూసుకున్నాను. దేహబలం ఫరవాలేదు. ఇద్దర్నయితే చాలా సునాయాసంగా పట్టెయ్యొచ్చు. కానీ యిద్దరే వస్తారనేముంది? అసలు నాకేమీ తెలీదనీ, సింహాచలం అబద్ధమాడుతోందనీ చెప్పి బుకాయిస్తేనో? —అవును. అదీ మంచి ఉపాయమే. పైగా వూళ్లో నాకు చాలా పలుకుబడి కూడా ఉంది.

తలుపు మరోసారి కటకలాడింది.

మొండిధైర్యంతో తలుపు తీశాను.

సింహాచలం తలొంచుకుని లోపలకు వచ్చి, తిన్నగా వంటింట్లోకి వెళ్లిపోయింది. దాని వెనకెవరూ లేరు. ఆశ్చర్యంతో బయటకు తొంగి చూశాను. ఎవ్వరూ లేరు.

అయితే సింహాచలం వాళ్ల జాతివాళ్లతో చెప్పలేదన్నమాట! నా శరీరం తేలికయినట్లయింది. ఎందుకైనా మంచిదని తలుపుగడియ వేసి, కుర్చీలో కూర్చున్నాను. సింహాచలం గిన్నెలు తోమి, ఇల్లు వూడ్చి వెళ్లిపోయింది. నేను తలుపు మళ్లీ గడియవేసి, మంచం మీద వాలిపోయాను. అన్నం వండుకుని తినాలి. అసలు తినాలనే కోర్కె చచ్చిపోయింది. ప్రతిజ్ఞ చేసిన సింహాచలం వాళ్ల వాళ్లతో ఎందుకు చెప్పలేదు? అనే తేలని విషయం ఆలోచిస్తూ నిద్రాదేవత వడిలోకి జారిపడ్డాను. తలుపు బాదడం వల్ల మెలకువ వచ్చింది. భళ్లున తెల్లారింది. లేచి వెళ్లి తలుపు తీశాను.

"ఇంకా నిద్రేనా" అంటూ సింహాచలం ప్రవేశించింది.

నా నిద్ర—నిద్రమత్తు వదలిపోయింది. బుర్ర గోక్కుంటూ లోపలకు వెళ్లిపోతున్న సింహాచలంకేసి ఆశ్చర్యంగా చూశాను. కాప్పేపటికి సింహాచలం వంటింట్లోంచి తిరిగొచ్చి, "గిన్నెల్లేవే? వంటొండుకోలేదా" అంది ఆశ్చర్యంతో.

"లేదు." అన్నాను వీధి తలుపు గడియ వేస్తూ.

"ఏం?"

"మీజాతి వాళ్లతోచెప్పి కీలూడదీయిస్తానని బెదిరించిపోయావుగదా రాత్రి —చచ్చే దెలాగూ తప్పనప్పుడు వెధవ వంట, తిండి ఎందుకనికీ వండుకోలేదు" అన్నాను.

సింహాచలం చిన్నగా నవ్వింది.

"ఏం ఎందుకు నవ్వుతావు" అన్నాను మంచంమీద కూర్చుంటూ. సింహాచలం మారు మాట్లాడకుండా చీపురు తీసుకుని, యిల్లూడ్చడం ప్రారంభించింది. వాళ్ల జాతివాళ్లతో ఎందుకు చెప్పలేదో అడగాలనిపించి, "మీ జాతివాళ్లతో ఎందుకు చెప్పలేదు" అనడిగాను.

ఇల్లూడుస్తున్న సింహాచలం అలాగే లేచి నిలబడకుండానే ఎడమ భుజంమీంచి నాకేసి చూసింది. అనక లేచి నిలబడి, "చెపితే మిమ్మల్ని చంపేస్రూ" అంది దాని ముఖంలో భయం స్పష్టంగా కనుపించింది.

"ముందు ఎందుకుచెప్తానని బెదిరించావు" అన్నాను.

సింహాచలం చూపులు దించుకుని "అప్పుడు ఆవేశం వచ్చింది. మీ యిల్లు దాటి బయటి కెళ్లాక జాలేసింది. తీరా చెప్పాక, మళ్లీ వద్దన్నా వాళ్లినరు. అందులో గూడెం రాముడికి తెలిసిందో, యిహ మనిషి నెత్తురు తాగుతాడు వాడు. మిమ్మల్ని చంపేస్తాడని భయం వేసింది" అంది.

"చంపేస్తే నీకేం" అన్నాను.

సింహాచలం నాకేసి అదోలా చూసి నవ్వు దాచుకుంది.

"ఏమో నాకు తెల్దు" అంది.

"అంటే."

"సెప్పెద్దమనుకున్నాను. సెప్పలే."

"అయితే మరెప్పుడూ కూడా సెప్పవా",

సింహాచలం తల అడ్డంగా వూపింది.

"నేను మళ్లీ రాత్రిలా ప్రవర్తిస్తే" అన్నాను. ఆ ప్రశ్న వేశాక, ఎందుకు వేశానా అనిపించింది. సింహాచలం మాత్రం ఆ ప్రశ్నకి సమాధానం చెప్ప లేదు. సిగ్గుపడి

మంద్రమందార

నవ్వుని మునిపళ్ళతో బిగపట్టి, తన పని ప్రారంభించింది.

* * *

ఆ పూళ్ళో అయితే బాగుండదని, ఆఫీసుకు శలవుపెట్టి విశాఖపట్నం వెళ్లి సింహాచలం ఫోటోలు కడిగించా. నే నూహించినకన్నా అందంగా వచ్చాయి. ఫోటోలతో యింటికి వస్తూండడం పక్కింట్లోంచి చూసిన సింహాచలం నేను లోపలకు వెళ్ళేసరికల్లా నా వెనకాలే వచ్చి "ఫోటోలు తెచ్చారా" అనడుగుతూ వంటింట్లోకి వెళ్లి స్టౌ ముట్టించింది.

నేను వీధి తలుపు గడియవేశాను.

నాలో అణగిమణగి ఉన్న కోర్కె విజృంభించింది. చేతిలోని సింహాచలం ఫోటో వైపు చూశాను. నోట్లో గడ్డిపరకతో కిలకిలా నవ్వుతున్న ఆ అందం—ఆ అవయవసౌష్టవం—నాకు పిచ్చెత్తినట్టయ్యింది. ఇంతలో, "ఏవీ ఫోటోలు" అంటూ సింహాచలం వచ్చింది. "ఇవిగో" అన్నాను.

"ఏవీ" అంటూ తడి చేతులు పైట కొంగుకు తుడుచుకుంటూ దగ్గిరకు వచ్చింది. "చూపించను" అన్నాను.

"లాక్కుంటా" అంది నవ్వుతూ.

"లాక్కోచూస్తేను" అన్నాను ఫోటోలు గుండె కానించుకుంటూ.

"చూపించండి" అంటూ యింకా, మీదకు వచ్చింది. వెంటనే ఆమెను నా హృదయానికి హత్తుకుని, రెండు చేతులతో ఆమెను బంధించాను.

ఆమె వారించలేదు.

* * *

మొదటిసారి చేసిన తప్పును తప్పుకాదని సమర్థించుకుంటే అది అలవాటయే ప్రమాద ముందని పెద్ద లంటారు. నావట అది అక్షరాలా నిజమయ్యింది. వాళ వాళ్ళతో చెప్పి సింహాచలం నా చర్మాన్ని, వలిపించకపోడమేగాకుండా నా వూహకు దోహద మిచ్చింది.

సింహాచలం నా కోర్కెనే తన కోర్కెగా చేసుకుంది.

ఇలా కొన్నినెలలు గడిగాయి.

గోపాలపురంలో నన్నెవరూ కించిత్ అయినా అనుమానించేవారు కాదు. నా స్థానిక గౌరవం కొన్ని రెట్లు అధికం గూడా అయ్యింది. చిన్నాపెద్దా, ఆడామగా అంతా నాతో చాలా చనువుగా మాట్లాడుతుండేవారు. స్కూలుఫైనలు చదివే ఆడపిల్లలు కూడా నా దగ్గరకు వచ్చి పాఠాలు నేర్చుకునేవారు. ఇంట్లో వున్న సమయాల్లో యిల్లంతా పిల్లలతోనే కలకలా డేది.

ఒకనాడు పొద్దున్నే సింహాచలం హడావిడిగా వచ్చింది. వస్తూనే, "మీరి వూరు వదిలెళ్ళిపోవాల" అంది. చాలా ఆయాసపడుతూ. నేను ఆశ్చర్యంగా దానికేసి చూశాను. కళ్ళనిండా నీరు నిలిచి వుంది. "ఏం! నే వెళ్లను." అన్నాను.

"నా మాటినండి. మీ కాళ్ళకు మొక్కుతా" అంది.

విషయం హాస్యానికి సంబంధించినది కాదనిపించింది.

"నే నుత్తమనిషిని కానట. మాయమ్మ కనిపెట్టింది. నిల్దీసడిగింది" అంది రొప్పుతూ.

నేను వులిక్కిపడ్డాను.

నా పాపం ఫలించింది.

ఏమని మాట్లాడాలో తెలీలేదు. మళ్ళీ సింహాచలమే ప్రారంభించింది.

"ఎవరో చెప్పమని నిల్దీసింది. నే చెప్ప లేదు. కులపోళ్ళతో చెప్తానంది. ఇదంతా రేత్రి జరిగింది. సాయంత్రం పంచాయతీ పెట్తుందేమో. వాళ్లెలాగయినా ఆరా తీస్తారు. తెలిసిందంటే మీ ప్రాణాలు నిలువునా దీస్తారు. నా మాటినండి వంటా వద్దు. పాడూవద్దు. ఉన్న పళంగా ఎలి పోండి" అంది.

"తెలినియ్. భయమెందుకు" అన్నా కుర్చీలో కూర్చుంటూ. ఆమాట అనే ధైర్యం నాకు ఎక్కణ్ణించి వచ్చిందో తెలీదు. సింహాచలం నాకేసి భయంగా చూసి, "చంపేస్తారు బాబోయ్" అంది గుండెబాదుకుంటూ.

"చంపనీ. చస్తే నీకేం!" అన్నాను.

ఆ మాటతో సింహాచలం వెక్కివెక్కి ఏడ్వడం ప్రారంభించింది. గమ్మున కుర్చీ

లోంచి లేచి, సింహాచలాన్ని నా బాహువు ల్లోకి తీసుకుని, కన్నీళ్ళు తుడుస్తూ, "ఛీ ఏడవకు. వుత్తినే అన్నాను." అన్నాను.

"బాబూ. మీ రెళ్లిపోండి. ఇయ్యాల కాపోతే రేప్పైనా మీ పేరు బయటికొస్తది. వాళ్ళూరుకోరు." అంది.

"మరి నేనెళ్లేక నిన్ను వాళ్ళు నిలదీస్తే" అన్నాను.

సింహాచలం కన్నీళ్లల్లోంచి నాకేసి జాలిగా చూసి, "వుసురుపోయినా చెప్పేది లేదు." అంది.

నా గుండెలోంచి బరువు దింపినట్లయ్యింది.

"అదికాదు. నిన్ను పెళ్లి చేసేసుకుంటా. అలాగయితే మీ వాళ్లకి అభ్యంతరం ఏవుంటుంది!" అన్నాను కుర్చీలో కూర్చుంటూ. సింహాచలం ఆశ్చర్యంగా నాకేసి చూసి, "అంతమాటన్నారదే పదివేలు. మీ పక్కన్నుంచోడానికి కూడా పనికిరాను. మీకు సక్కగా ఇంగ్లీషు సదివినమ్మ రావాలి. మీ పంచన నాకు పని మనిషిగా చోటిస్తే చాలు బాబూ" అంది.

"ఛీ. అదేంమాట" అన్నాను నేను.

"అంతే బాబూ. నా నగాటిసంగి. ఆ సివా(దప్పన్న మీ దొట్టేసి సెప్తన్నా. నాకు కొడుకు పుడ్తాడు. ఆడు అచ్చం మీ పోలికే వుంటాడు. వాడిని మాత్రం మీరు పెంచి పెద్ద చేయాలి. ఇంగ్లీషు చెప్పించాల. వాడు మీ కొడుకని సెప్పక పోయినా పరవాలేదు. కానీ వాడిని మీ రాదరించాలి. నా ప్రాణం పోయినా మీపేరు బయట పెట్టను. సివా(దప్పన్న పాదాల మీద ప్రమాణం సేసినట్టే కానీ, నాకు మీ రొట్టేసి సెప్పాలి. నా కొడుకుని మీరే తీసుకోవాలి. వాడి కప్పన్నని పేరెడుతా. మూడేళ్ళొచ్చాక మీ కిస్తా....." సింహాచలం ఆయాసంతో చెప్పుపోతోంది.

"కొడుకే పుడ్తాడని నీకేం తెలుసు" అన్నాను. అలాటి సమయంలో అలాటి చచ్చు ప్రశ్న వేసినందుకునసిగ్గేసింది. సింహాచలం రెండుచేతులూ గుండె మీదేసుకుని "నాకు కలొచ్చింది. సివా(దప్పన్న తన పేరెట్టాలని చెప్పాడు. నాకు తెల్సు

మగపిల్లాడే నాకు. కొడుకే...మీ పోలికలతో వుంటాడు. వో ఏడాది పోయాక యీ వూ్ర రండి. అబ్బాయిని చూడండి, పెళ్లి చేసుకుని మరీ రండి. నా వూ టి వండి. మీకు మొక్కుతా'' అంటూ సింహాచలం ఆయాసంతో ఆగింది.

నాకు జాలి వేసింది. ''ఏమిటి! పిచ్చి పట్టిందా నీకు! అంత భయందేనికి! మా వాళ్లు నన్ను ఏమీ అనరు. నాకు అమ్మ లేదు. మా నాన్న నా మాట కాదనరు. నిన్ను పెళ్లి చేసుకుంటాను. భయపడకు! అంటూ సింహాచలాన్ని నా గుండెకు హత్తుకున్నాను. ఆమె వెంటనే విడిపోయి, ''ఛీ అదివద్దు. ఆఫీసులకెళ్లే వారు. మీకు మంచి దొరలాటమ్మ రావాలి. ఏడాదిలో పెళ్లి చేసుకుని పిల్లాణ్ణి ఎత్తు కుని నా కొడుకును చూడానికి రావాలి.'' అంది.


''పోనీ అలాగేలే'' అన్నానేమనాలో తెలీక.

సింహాచలం మౌనంగా కన్నీరు తుడుచుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది. నేను మళ్లీ కుర్చీలో కూలబడాను. సింహాచలాన్ని వివాహం చేసుకుంటానని ఆవేశంలో అన్నానేగాని, నిజంగా నేను చెగలిగిన పనా అది! నాకా మాత్రం ధైర్యమే వుంటేనా జీవితం యిలాటి మలుపు తిరిగేదా! నామీద నాకే అసహ్యం వేసింది.

సింహాచలం పని పూర్తి చేసుకుని నా దగ్గరకు వచ్చి, నేల మీద కూర్చుని ''మదే ఐం—మధ్యాన్నంలోగా వెళ్లి పోండి. సాయంత్రం మాయమ్మ పంచాయితీ పెట్టేలావుంది. కానీ, వో సంవత్సరం అయ్యేసరికి మీరు పెళ్లి చేసుకుని, అమ్మగారితో యీ వూరొచ్చి, నా కొడుకును చూడాలి. నాలుగేళ్లు వెళ్లి ఐదో ఏడొచ్చాక మీకిచ్చేస్తా. వద్దంటే యీ యిస్కూల్లోనే వున్న సదువు చెప్పిస్తాను. ఇంగ్లీషు చదువులకు మీరు పట్నం తీసుకు వెళ్లాలి. నా బుర్ర మీద చెయ్యేసి ప్రమాణం చెయ్యండి. నా కొడుక్కి అన్యాయం చేయనని ప్రమాణం చెయ్యండి. ఆ సివ్వాద్రప్పన్న మీదొట్టేసి చెప్పండి. నా పీకలో ప్రాణంపోయినా మీ పేరు బయటెట్టను.'' అంది. నా రకం వేడెక్కింది. యాంత్రికంగా సింహాచలం నెత్తి మీద చెయ్యేసి, ''నువ్వు చెప్పినట్లే చేస్తాను. మధ్యాహ్నం లోగా యీ వూరువదిలి వెళ్లిపోతాను. ఏడాదిలోగా పెళ్లి చేసుకుని వస్తాను. ఆ పైన నువ్వు ఎలా చెయ్యమంటే అలాగే చేస్తాను. సరేనా'' అన్నాను. సింహాచలం దీర్ఘంగా నిట్టూర్చి, కన్నీళ్లు తుడ్చుకుని, లేచి నిలబడుతూ, ''హమ్మయ్య, నా కిప్పు డానందంగా వుంది. కొండంత బలంతో బతుకుతా'' అంది. నేను ఆఖరిసారిగా సింహాచలాన్ని నా హృదయానికి హత్తుకున్నాను. ఆమె నన్ను పెనవేసుకు పోయింది.

పెట్టెలోంచి వంద రూపాయలు, పది పదులు లెక్కపెట్టి, సింహాచలాని కిచ్చి ''ఈ డబ్బు దాచుకో. మళ్లీ కొంత పంపిస్తా'' అన్నాను. ఆ డబ్బులు చూసి సింహాచలం పాముని చూసి బెదిరినట్లు బెదిరింది. ''ఛీ డబ్బెందుకు నాకు.'' అంది ఛీత్కారం చేస్తూ.

''నీకు కాదు. మన బాబుకి. దాచు'' అన్నాను. సింహాచలం నాకేసి దీనంగా



ముద్దమందార

చూపి, "యీ వందతోనే నా చెర వదిలించుకుందామనుకుంటున్నారా." అంది. కొరడా దెబ్బలాగ తగిలిందా మాట నాకు. "ఛీ ఛీ అవేం మాటలు? సింహాద్రి అప్పన్న సాక్షిగా నువ్వు చెప్పినట్లే చేస్తాను. నన్ను నమ్ము" అంటూ డబ్బు ఆమె చేతిలో పెట్టాను. ఆమె డబ్బుకేసి చూస్తూ "ఈ డబ్బు ఎలాగైనా మాయమ్మ కంట బడకమానదు. దీనితో మరింత గల్లంతవుతుంది. నా మాటవినండి. ఈ డబ్బుతోనే పిల్లాడిని పెంచగలనా? మళ్లి మీరు ఎలా పంపుతారు? ఇయన్ని అయ్యేది కాదు. నా రెక్కల్లో శక్తి వుంది. పనిచేసి మరీ నా పిల్లాడిని పెంచుతాను." అంది.

"మరి..మరి నువ్వు పెళ్లి చేస్కోవా" అన్నాను. తీరా అనేశాక అలాటి ప్రశ్న వేసినందుకు బాధపడ్డాను. సింహాచలం కళ్ల వెంట నీరుధారగా కారింది. "నన్ను హేళన చేస్తున్నావా బాబూ. ఇక నాకు పెళ్లేమిటి? అరిటి చెట్లు నాకు దైవం. కుక్కముట్టు కున్న కుండకు సుద్దుండదని గుళ్లో శాస్త్రులుగారు చెప్పారు. నా బతుకింతే—ఇక నేనిలా పోవాల్సిందే. నా బాబు కోసం బతకాల్సిందే—మీ పంచన కూడా వుణివ్వని కోరను. కానీ, నా బాబుని పెంచి పెద్దాణ్ని చేయాలి. చాలా పెద్దాణ్ణి చేయాలి." అంది వెక్కి వెక్కి ఏడుస్తూ. నేను సింహాచలం కన్నీళ్లు తుడిచి, "నువ్వేలా చెప్తుంటే అలాగే చేస్తాను. ధైర్యంగా వుండు" అన్నాను. సింహాచలం వేదాంతిలా నవ్వింది. "నాకు ధైర్యమే బాబూ. మీరు నా బిడ్డని మోసం చెయ్యరు. నాకు తెలుసు. ఇక నేనెళ్తా. మధ్యాహ్నానికి మీరెళ్లిపోండి. పైయ్యేడు అమ్మగారితో రావాలి. అన్నట్లు ఇదిగో మందార పువ్వు. నన్ను గుర్తెట్టుకోకపోయినా, యీ పువ్వును గుర్తెట్టుకోండి" అంటూ తలలోంచి మందార పువ్వు తీసి, నా చేతిలో పెట్టి నాకేసి ఆఖరిసారి చూసి వెళ్లిపోయింది. (సశేషం)

శ్రీశ్రీ చెప్పదలుచుకున్నదేమిటో అర్థంకావడం లేదు. ఎక్స్‌ప్రెషనిస్టు పెయింటింగులా, ఓవతా వ్రస్తంలా, కరిమింగిన వెలగపండులా ఉంది. ఆయన మనస్సుకి ఏంతోస్తే అది ఓ వరసా వావీ లేకపోయినా వరి రాసేశాడట. మంట, ముళ్లడొంకలు, నెక్లెస్, టైపురైటరు, హంస— ఎందువల్లనో ఇవిఅన్నీ విరవగా ఒడిచానితరవాత ఒకటిగా ఆయన మనస్సులో దొర్లి వ్యాయం అయ్యాయట. వాటిఅర్థం ఆయనకే తెలియదట. అయినా సరేరాసేశాడట. మనస్సుకి తట్టిన ప్రతిపిచ్చి ఊహని వ్రాసికాగితాలు ఖరాబుచెయ్యవలసిన పనిలేదు. పేజీలు పెంచే ధోరణి ఉండున్నరకి పెంచడానికి తప్ప.

మయకోవస్కీ వ్రాసిన లెనిన్ దండకంచాలా పేలవంగా ఉంది. లెనిన్‌లో స్నానంచేస్తాడట. లెనిన్‌కథాక్రమం సదా జపించాడట. లెనినవేడిగాఉన్నాడట. లెనిన్ వాడిగా ఉన్నాడట. ఇంకా ఏమేమోనట. వెర్రికుదిరిందిట. తలకి రోకలి చుట్టాలిట.

అలెక్‌జాండర్ సెర్గేయవిచ్ పూష్కిన్‌రచనకు అనువాదం ఒకటేఉంది. ఈమహాకవి రష్యన్ సాహిత్యాకాశంలో సూర్యుడిలా ప్రకాశించాడు. అతని కవిత్వంతో రష్యన్ సాహిత్యానికి కొత్త వెలుగు పట్టింది. అంత్యానుప్రాసలతో లయబద్ధమైన ఝుంఝుంా నిలంలాంటి కవిత్వం అతడిది. ఆ అందం తెలుగులో పూర్తిగా వచ్చినట్లు లేదు. అనువాదాలలో 'పుట్టని పాప ప్రార్థన' అత్యుత్తమంగా ఉంది.

శ్రీశ్రీ తాను సృష్టించిన ఈనవఖడ్గానికి సాన మరికొంత బాగా పెట్టవలసిన అవసరం ఉంది. ఈకవి కలకాలం నిలిచేరచనలు ఇంకా ఇంకా తెలుగువాడికి అందిస్తాడని ఆశిద్దాం.

—హిమబిందు.

ఈ నెల 18న సన్మానాలు సత్కారాలు



శత చిత్ర నాయకుడు కాంతారావు


ప్రముఖ తెలుగు నటులు శ్రీ టి. ఎల్. కాంతారావు, మొత్తం నూటఒక్కచిత్రాల్లో నటించిన తరుణంలో ఈ నెల 18 వ కోదాడులో ఏర్పాటయిన సన్మానోత్సవ సందర్భంలో, ప్రత్యేక సన్మాన సంఘం పంపిన వివరములు:—

"శ్రీ టి. ఎల్. కాంతారావు నూటొక్క చిత్రాలు పూర్తిచేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన స్వస్థలం కోదాడులో 18—5—66 న టి. ఎల్. కాంతారావు సన్మానకమిటీవారు ఘనసన్మానం చేయ సంకల్పించారు. కేంద్ర పరిశ్రమలమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయ, దేవాలయ ధర్మాదాయ శాఖా మాత్యులు శ్రీ పి. వి. నరసింహారావు ప్రారంభోపన్యాసం చేస్తారు. కాంతారావు గురించి ప్రముఖుల అభిప్రాయాలు ఆశీస్సులు పొందుపరుస్తూ, కాంతారావు జీవిత విశేషాల్ని, నటించిన చిత్రాలలో స్టిల్సు పొందుపరుస్తూ ఒక సావనీర్ ప్రచురించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

కృష్ణకుమారి, రాజశ్రీ, వాణిశ్రీ, పద్మశ్రీ నాగయ్య, రాజనాల, లింగమూర్తి, రామకృష్ణ, రాజబాబు ఆదిగాగల ఆర్టిస్టులు, సి. ఎస్. రావు, ఎస్. డి. లాల్, జి. విశ్వనాథ్, వై. ఆర్. స్వామి, బి. యస్. నారాయణ ఆదిగాగల దర్శకులు, శ్రీ భావనారాయణ, డి. యల్. నారాయణ ఆదిగాగల నిర్మాతలు పూర్ణా పిక్చర్సు అధినేత శ్రీకావు రాజా మున్నగువారు ఈ వేడుకలలో పాల్గొన గలరు. కుమారి చంద్రకళ కూచిపూడి నృత్యకలాపం, ప్లేబాక్ ఆర్టిస్టు జానకి గానకచ్చేరి, రాజనాల, రామకృష్ణ, వాణిశ్రీ, సత్యనారాయణ శేషగిరిరావులతో 'తుఫాన్' నాటిక ప్రదర్శనం ఈ వేడుకల సందర్భంలో ప్రత్యేకాకర్షణలు— మద్రాసు నుండి ఆర్టిస్టులు, హితులు పత్రికాధిపతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డ కంపార్టుమెంటులో 17వ తేదీ బయలుదేరి 18 ఉదయాన బెజవాడచేరుకుంటారు. అచటినుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డ కార్లలో కోదాడు చేరుకుంటారు. బెజవాడ వారు చేరుకునేటప్పటికి తగు వసతి సౌకర్యాలు కల్పించడానికి స్థానికప్రముఖులు పూనుకుంటున్నారు.

కోదాడులో స్టేజి ఏర్పాటుకు సన్మాన సభా ప్రాంగణ అలంకరణకు శ్రీ కె. ఎస్. మూర్తి, పెయింటర్లతోను, మోల్డర్లతోను తరలి వెళ్లారు.

16వ తేదీసాయంకాలం నాలుగుగంటలకు ఊరేగింపు జరుగుతుంది. 43 జతల ఎడ్లతో రథంకట్టి కాంతారావును, ఆర్టిస్టులను అందు ఉపవిష్టులను చేసి ఊరేగిస్తారు. 6 నుండి తొమ్మిదిగంటలవరకూ సన్మాన కార్యక్రమం, అనంతరం విందు జరుగుతుంది. వినోదవైజ్ఞానిక కార్యక్రమాలు తెల్లవారుఝామువరకు జరుగుతూనే వుంటాయి." ●



వాశిరాజు ప్రకాశం

వన్నెల వీధుల్లో వెన్నెల జల్లులు

4



అందమూ, ఆకర్షణా

(గత సంచిక తరువాయి)

ఆ సాయంసంధ్య వేళ, వసంత తిరిగివేసి కొచ్చి, కోడంబాకం పోవర్ బ్రిడ్జి మెంట విలిగ్స్ కొత్తగా వెలిసిన ఆ మెర్క్యూరీ దీపాల కాంతిని నాసుకొంటూ స్టూడియోల తళ్లేపి, వచ్చేవి—రకరకాల కార్లు, అందమైన కార్లు పోయినాలను, హారనులను ఒలకబోసి కొంటూ పరుగులు తీస్తుంటాయి.

ఇలా వెళ్లే ప్రతి ఒక్కకారు వెనుక ఒక కథ వుంది. విషాదం, మోహం విచిత్రమైన మధుర్యమైన గాథ వుంటుంది. కాని, యీ



ఆ అమ్మాయి

కాదు అవేవీ బయటకిరావు. తెల్లటివన్నీ పాలు వల్లనివన్నీ నీరు!

నిజమే! కాదనం! ఎవరి బ్రతుకుతెరువు వారిది. అంతదూరాన మంచి మైళ్ల మైళ్ల ఆయాసంతో ప్రయాణం చేసి యీ పూరొచ్చింది బ్రతుకుదెరువు కోసమే గాని, త్యాగాలు చేయటానికీ, ప్రజాసేవ చేయటానికి కాదు.

కాస్త జీవితంలో స్థిరపడిపోతూ, నలుగురి దృష్టినీ అప్పుడప్పుడే ఆకర్షిస్తున్న పెద్ద తారలకు అప్పటికే ఆపాదమస్తకం 'పొగరు' బాగా ఎక్కిపోయి వుంటుంది. ప్రతి క్షణంలో దర్జా ఒలకబోస్తూ, ఎవరికీ అందని ఒక పీఠం ఎక్కి కూర్చుంటారు. విద్య లేదు, సరిగదా వినయమూలు అంతకన్నా లేదు. పేరుప్రతిష్ఠలు, ధనమూ (సినిమా ప్రపంచంలో యివి కేవలం తాత్కాలికాలే!) అనే రెండు అంశాల వ్యామోహంలో పడి చుట్టూ వున్నవారిని ఏ మాత్రం జీవులుగానో పరిగణించటం, అహా, పెద్దవారికే తెలిసినంత మరొకరికి తెలియదు.

వేళకు షూటింగులకు వెళ్లరు కొందరు. వచ్చినవారితో మర్యాదగా మాట్లాడే సభ్యత తెలియదు కొందరికి. ఇంట్లో వుంటూవున్న వేళలు వుండరు. తమ చుట్టూ వున్నవారితో కలిసిపోవాలనే భావం వీరి కసలు వుండదు.

హైదరాబాదులాంటి (తడి) ప్రాంతంలో అయితే, మదరాసు వచ్చినవి విమానాశ్రయానికి వచ్చి, బ్రక్కనేవున్న జాన్ 'రెస్టారెంట్'కు అలావెళ్లి, వీరకు దానిని ఒక పళాన వదిలి రాలేక, కొన్నిగంటల సేపు ప్రపంచాన్నే మరచిపోయి...యీలోగా, విమానం మదరాసు చేరుకోటం.....నిజం యిది!

ఇలాంటి 'వాతావరణం'లో జీవయాత్ర చేయటం, కొత్తవారికి వ్రతం మాటలాగే కొత్తవారయినా, పాతవారయినా, యింటి వద్ద బయలుదేరేముందు ఒకే స్థితిలో వుండొచ్చు! కాని, గ్రుడ్డి ప్రపంచం వీరిని సులభంగా మార్చి వేసేందుకు అనువైన ఆకర్షణలెన్నో వీరితో వున్నాయి.

* * *

'కృషితో నాస్తి దుర్భిక్షం' అంటుంది నటి యమున, తన కృషిని, ప్రాచీన గాథ అను నెమరు వేసికొంటూ.

సినిమాలలో అవకాశాలు రావాలని, మంచి నటిని కావాలని, భవిష్యత్తులో వెలుగుబాటలు వేసికోవాలని, ఆనాడే కాదు, ఈ అమ్మాయి యీనాడు కూడా ప్రయత్నాలను చేస్తోంది.

ఉండే అవరోధాలు, ఎదురయ్యే ప్రతిబంధకాలు...ఎలాగూ తప్పవు. అయినా, తన పరిధిలో, సడలని ఆత్మవిశ్వాసంతో విశ్వాళమైన కృషిని సాగించాలని, యీ రంగంలో ప్రత్యేకమైన 'వ్యక్తిత్వం'తో స్థిరపడిపో

అని ఆ అమ్మాయి ఆశాభావం

యమున చేసే కృషి రకరకాలుగా వున్నది స్వతహాగా తెలుగువారి అమ్మాయి గనుక యిక్కడ కొచ్చి తమిళం నేర్చుకొంటోంది చాలావరకు నేర్చుకొన్నట్లే ఈనాడు తమిళ పత్రికలు బాగా చదువగలుగుతుంది, వ్రాస్తుంది కూడా కన్నడదేశం వెళ్లి నృత్యాలను ప్రదర్శించింది ఆంధ్రదేశంలో నయితేనేమి, యితర ప్రాంతాల్లో నయితే నేమి, ఆమె యిచ్చిన నృత్య ప్రదర్శనాలు యిప్పటికి 75 నుంచి 80 వరకు వున్నాయి చిన్నతనం నుంచి ఎంతో ఆసక్తితో, అభిమానంతో, ఆశతో నృత్యాన్ని అభ్యసించాననీ, యీ నాడయినా అది సద్వినియోగం కాగలిగితే, తాను, తన కృషీ చరితార్థం అయినట్లేనని నటి యమున ఉవాచ ఈ ప్రదర్శనాలు ఆమెకి తెచ్చి పెట్టింది లెక్కలేనన్ని ప్రశంసాపత్రాలు మాత్రమే

కొందరు ఏమాత్రం ప్రతిభ లేకుండానే నటీమణులు అవుతున్న యీ తరుణంలో తను మాత్రం 'సినిమా'లో ఎందుకు చేరకూడదు? అని యమున అభిప్రాయం ఇంతవరకు కొన్ని అవకాశాలొచ్చాయి వాటిల్లో ముఖ్యమైనది ఒక తమిళ చిత్రం మదన్ ఫిలింస్‌వారు నిర్మిస్తున్న "మల్లిక్ పందల్'' అనే చిత్రంలో యీ అమ్మాయి ద్వితీయనాయిక ఈ చిత్ర నిర్మాణం యింకా జరుగుతూనే వుంది

అయితే, యితర అవకాశాల మాట ఏమిటి? అన్నదే చర్చనీయాంశం అదే యీ విలేఖరి ఆమెను అడిగాడు "మరెక్కడన్నా అవకాశాలున్నాయా?''

"అవకాశాల కన్నా ఆశ లెక్కువవున్నాయి నన్ను చూచిన సహృదయులయిన కొందరు నిర్మాతలు—తెలుగు, తమిళంలో కూడా, నాకు అవకాశలిస్తామన్నారు అవి వస్తాయి నాకు తెలిసిన కొద్దిపాటి 'నటన'నే ప్రదర్శించుకొనే అవకాశం కనుచూపు, మేరలోనే వుంది'' అంటుంది నటి యమున

"ఎన్నయినా చెప్పండి నిర్మాతల, దర్శకుల సహకారం చాలా అవసరం'' అంటుంది ఆ అమ్మాయి. "వీరి సహకారం, ప్రోత్సాహమూ లేనిదే ముందుకు ఎలా వెళ్లగలం?' అంది

ఇలా వుంటయ్ వ్యవహారాలు.

* * *

సినిమారంగం తీరుతెన్నులే అంత ఇక్కడివారి ధోరణులే అంత ఒకసారి యిందులో పడిపోయామంటే, యీ వూబిలోనుంచి రావటం అంటే తలప్రాణం తోకకు రావటం అన్నమాట


సినిమారంగం మీదనె ఆశలను పెంచుకొంటూ, చివరకు వాటిని కన్నీటి రూపంలోకి, ఆవేదనలోకి అనువదించుకోగలిగినవారిలో కేవలం కొందరమ్మాయిలే కాదు లుగా స్థిరపడిపోయిన వారిని నిందించాలో లేక, వారిని చూచి జాలిపడాలో తెలియటం లేదు

అమ్మాయిల్లో కూడా తీవ్రమైన పరిస్థితులకు గురి అయిన వారు ఎందరో వున్నారని యమున చెప్పింది తనకు ఆ అవసరం లేకపోయిందని, తన వ్యక్తిత్వాన్ని తాను విక్రయించుకోలేనని ఆ అమ్మాయి కథనం.

ఇదీ యిక్కడి పరిస్థితి వాస్తవమైన పరిస్థితి

* * *

మనం, మన వూళ్లో ఎక్కడో కూర్చొని అసలు స్థితి తెలియక ఎన్నో ఎన్నో వూహించుకుంటాం బంగారు కలలు కంటూ, ఆ కలలే పండాలని, అవి వాస్తవాలు కావాలని గాలిమేడలు నిర్మించుకొంటే ఏం ప్రయోజనం?



(ఫోటోలు ప్రభాకర్)

నిరీక్షణ ..

కొందరబ్బాయిలు కూడా వున్నారు ఊళ్లో అమ్మ, నాన్న చెప్పినట్లు చదువుకొనక అల్లరిచిల్లరిగా తిరిగి, సినిమాల వ్యామోహంలో పడిపోయి, ఒక శుభముహూర్తాన, ఇంటో వున్న నాలుగు కాసులు పట్టుకొని మదరాసు చేరుకొన్న వారెందరో వున్నారు ఆ నాలుగు కాసులు ఎంతకాలం వస్తాయి? ఇక్కడికి రాగానే వాళ్లు వీళ్లు చేరిని,ముందు ఆ వున్న డబ్బును వదలగొట్టారు ఇక, దిక్కేమిటి? ఆ దిక్కే లేక, తిరిగి యింటికి వెళ్లలేక, వెళ్లినా తోటివారితోపాటు మళ్లీ స్కూలుకు వెళ్లే 'సహసం' లేక, మదరాసు లోనే ఏదో ఫిలింకంపెనీ 'ఆఫీస్ బాయ్'

ఏమయినా, సినిమారంగానికే గాక, దేశం యొక్క పేరుప్రతిష్ఠలకు అవమానకరమైన సంప్రదాయాలు సినిమారంగంలో పోవాలి, "మాకూ మంచి సినిమా ప్రపంచం వుంది మావారూ నిజమైన కళాకారులు'' అని అందరం చెప్పుకొనేలాగా వ్యవహరించాలి

వ్యక్తి బ్రతికేది కొంతకాలమే కాని దేశం శతాబ్దాల తరబడి వుంటుంది ఈ

పన్నీటి వీధుల్లో...


నాటి మన కథను, మన తరువాత తరం వారు, ఆ తరువాతి తరంవారు చెప్పుకొంటారు— యీనాడు మనం చరిత్రపాఠాలు చదువుకొంటున్నట్లు!


రోజులు గడిచేకొద్దీ, మనిషి ప్రతిభ మేధస్సు పెరుగుతవి కనుక, మన తరువాతి తరాలవారు మనకంటె ప్రతిభావంతులు కావటానికి, ఎన్నో రంగాల్లో విశేషమైన ప్రగతిని సాధించటానికి అవకాశాలున్నాయి. ఆనాడు వారు కూడా యిలా వుంటారని నేననుకోను. అప్పుడు వారంతా, 20 వ శతాబ్దపు సినిమారంగపు చరిత్ర చదువుకొని, వారి పూర్వీకుల మీద అసహ్యించుకొనకుండా వుంటారా?

అందమైనది, ఆకర్షణీయమైనదీ అయిన 'సినిమారంగం' వెనుక యింతటి అగాధం వున్నది. ఈ అందాన్ని అందుకోవాలనుకొంటూ, ఆకర్షణకు లోబడిపోయి, వున్నవి లేనివిగా, లేనివి వున్నవిగా వూహించుకొంటూ, జీవితంమీద, సినిమా ప్రపంచంమీద ఎనలేని మమకారం పెంచుకొంటూ, ఎట్టకేలకు తమ ఆశయాలమేరకు చేరుకోలేక మార్గమధ్యానవున్న యీ అగాధంలో పడిపోయిన వారెందరో వున్నారు. కనిపించేదంతా పన్నీరు కాదు. ఈనాడు ప్రముఖులయిన వారందరి యింట సుగంధం వెదజల్లే పన్నీరు, ఎందరో అమాయకుల కన్నీటిలో నుంచే తయారయింది. పన్నీటి వీధులను చూచి భ్రమపడిన చాలా మందికి చివర యీ కన్నీటి జల్లులే మిగులుతాయి (అయిపోయింది)


కృతజ్ఞతలు

ఈ శీర్షిక తయారీకి గత నాలుగున్నర మాసాలలో తోడ్పడిన నటి యమునకు, ఆమె తండ్రి శ్రీ సర్వారావుకు. యీ శీర్షిక క్రింద యింటర్వ్యూ చేయబడిన 28 మంది కొత్త తారలకు, ముగ్గురు పెద్ద దర్శకులకు, ఆరుగురు అగ్రతారలకు, ఫొటోగ్రాఫర్ శేఖర్‌కు వ్యాసకర్త, సచిత్రవారపత్రిక కృతజ్ఞతలు. ●


Roopkala
రేఖా & మురళీ ఆర్ట్స్
పద్మనాభం
పొట్టి ప్లీడరు
దర్శకత్వం: K. హేమాంబరధర రావు... నిర్మాత: B. పురుషోత్తం
రచన: బమిడిపాటి రాధాకృష్ణ ...సంగీతం: కోదండపాణి
స్టూడియో: ప్రసాద్ ...
VIJAYA



దిన దినానికీ ..
రెక్సోనావల్ల
మీ చర్మ సౌందర్యం అతి
మనోహరంగా వెంపొందుతుంది
Rexona
కేడిల్‌తో గూడిన
రెక్సోనా
మీ చర్మానికి
గుణకారి


SRI SAMBHU FILMS
శ్రీ శంభుఫిలింస్ వారి
శ్రీకాకుళ
ఆంధ్రమహావిష్ణు
కథ
నిర్మాత- దగ్గుబాటి లక్ష్మినారాయణచౌదరి
దర్శకత్వం ఎ.కె. శేఖర్



అంతర్జాతీయ అర్థిక సంస్థ డిప్యూటి కార్యనిర్వహణ ఉపాధ్యక్షులుగా నియమితులైన శ్రీ జీవ్. ఎస్ రాజా

అవీ - యివీ...

'ఎస్సో' కంపెనీ కొత్త మానేజర్

బొంబాయిలోని 'ఎస్సో' కంపెనీ నూనె కర్మాగారానికి డా. జహంగీర్ పిరాజ్జీ కామా 1—6—66 నుంచి మానేజర్ అయారు. దీనితో ఈ ప్రాజెక్టులో భారతీయుల బాధ్యత, అధికారం బాగా హెచ్చు అవుతాయి. డా.కామా బొంబాయి విశ్వవిద్యాలయంలో ఎం. టెక్. లివర్‌పూల్ విశ్వ విద్యాలయంలో డాక్టరేటు తీసుకున్నారు.

వివాహం

ప్రఖ్యాత తమిళనటుడు శ్రీ ఎం. జి రామచంద్రన్ సోదరుడు శ్రీ ఎం.జి.చక్రపాణి కుమార్తె చి. లీలావతికి డాక్టర్ రవీంద్రనాథన్‌కు ఏప్రిల్ 18వ తేదీ ఉదయం మద్రాసులోని రాజేశ్వరీ కళ్యాణ మండపంలో శ్రీ అన్నాదొరై సమక్షాన వైభవంగా వివాహం జరిగింది.

Edited Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6&7 Thambu chetty Street Madras-1. Phones Editorial, 21747; Other depts; 29766. Chief Editor: S Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA

